# సైబరాబాద్ కథలు



# విషయసూచిక

1. వెయ్యి నోటు 3
2. థాంక్ యూ 17
3. ఉద్యోగం 30

# ఒక చిన్న మాట

ఈ కథల్లో నేను ప్రస్తుతం  హైదరాబాదులో బతుకుతున్న సామాన్యుల జీవితం చిత్రించాలనుకున్నాను. నా చుట్టూ ఉన్నది, నాకు తెలిసినది. ఇక్కడ కథ కన్నా ముఖ్యం వ్యక్తులు, వారి వారి ప్రవర్తన.

ఇప్పుడు మూడు కథలే ఉన్నాయి. ఇవి మీకు నచ్చితే ఇంకా కొన్ని పంచుకోగలను.

# 1. వెయ్యి నోటు

"రషీద్, లెవ్వు రా... పనికి వోవా...?"

"ఎన్ని సార్లు పిలవాలె? టైం అయింది లే."

పక్క మీద బోర్లా పడుకున్న రషీద్ బద్ధకంగా కళ్ళు తెరిచిండు. సీలింగ్ ఫ్యాన్ కీచు కీచు మని శబ్దం చేస్తుంది. గోడ మీద ఉన్న గడియారం దిక్కు  చూశిండు. నాలుగున్నర కొట్టింది. ఇంకో అర్ధ గంటల పనికి వోవాలె. ఈ ఫ్యాన్ లొల్లి ఎక్కువయ్యింది ఈ మధ్య. ఎల్లెల్కల తిరిగి పైనున్న ఫ్యాన్ని చూశిండు. రెక్కల అంచులల్ల నల్లగా మురికి పట్టి మెల్లగా, ఊగుకుంట నడుస్తుంది. ఇది ఎప్పుడో ఇరిగి మీదపడ్తది అని రషీద్ చిన్నప్పట్నించి అంటానే ఉండు. ఇప్పుడు రషీద్ వయసు పదమూడు. ఆ ఫ్యాన్ వయసు ఇరవై. అటు పక్క ఇటు పక్క తమ్ముళ్ళు పండుకున్నరు. ముగ్గురికి కలిపి ఒకటే పెద్ద బొంత. మొన్నటి దాంక వీడు కూడా బాధ్యత లేకుండా తమ్ముళ్ళతో ఆదుకుంట తిరిగినోడే. ఈ మధ్యల్నే పన్ల చేరి బాగుపడ్తుండు. ఇట్ల వాళ్ళ అబ్బా అంటడు.

పిల్లల్ని లేపకుండ మెల్లగ లేచి ఇవతల రూంలకి ఒచ్చిండు. ఇద్దరు అక్కలు, చెల్లె ఇంకా లెవ్వలే. అమ్మీ మాత్రం లేసింది. వంట ఇంట్ల నించి సప్పుడు ఒస్తుంది. రైలు కంపార్ట్మెంట్ లెక్క మూడు రూంల ఇల్లు. పిల్లలందరూ పండుకుంటే ఇంక నడిసే జాగుండదు. అందుకే అమ్మీ అబ్బా వంటింట్లనే పండుకుంటరు. సప్పుడు చెయ్యకుండా కుర్తా పైజమా తీస్కోని మల్ల ఒచ్చేసిండు. బయటికి వొయ్యి జల్దీ జల్దీ మొహం కడుక్కుండు. ఇంకా చీకటి గానే ఉంది. గల్లీల ఎవ్వరు లెవ్వలే. అప్పుడప్పుడే అజాన్ మోగుతుంది పక్క గల్లీ మస్జిద్ నించి.

"అమ్మీ.. నేను వోతున్నా."

"అరేయ్.. రషీద్ బేటా.. ఇయ్యాల మీ ఓనర్ని అడిగి ఐదు  వందలు తీస్క రారా. ఇప్పటికే మూడు నెల్ల కిరాయి బాకీ ఉంది. మన రజియ మంచిదే కాని కిరాయితోనే బతికే ముసల్ది. మీ అబ్బా మూడు రోజుల నించి పత్తా లేడు. నా దెగ్గర ఐదు వందలు ఉన్నయి. నువ్వొక ఐదు వందలు తెస్తే కనీసం ఒక్క నెల కిరాయి అయినా కట్టొచ్చు."

రషీద్ గానికి అర్థం అయిపోయింది. ఇప్పుడు కాని ఆపకపోతే అమ్మీ జాన్ని ఆపుడు కష్టం. ఒక గంట మీద చెప్తది. ఆ చెప్పుడు చెప్పుడు ఏడుపు తోనే ముగుస్తది మల్ల. అబ్బాజాన్ బండి మీద పండ్లు అమ్ముతడు. అప్పుడప్పుడు ఇట్ల రెండు మూడు రోజులు ఇంటికి రాకుండా పోతడు. ఫికర్ జెయ్యనీకె ఏం లేదు. ఎట్ల పోయినోడు అట్లనే ఒచ్చేస్తడు.

ఇంట్ల ఇంతకు ముందు కష్టాలు ఉంటుండే కాని అక్క సెకాహ్ అయ్యి ఎల్లిపోయినంక జెర ఎక్కువయ్యింది. అప్పుడంటే అమ్మీ తో పాటు జంషీద్ ఆప కూడా అంట్లు కడగనీకె పోతుండే. ఇప్పుడు ఇంట్ల సంపాదించేటోళ్ళు ముగ్గురే ఐపోయిన్రు. చిన్నక్క ఫర్జానాని కలుపుకొని. తనకొచ్చే జీతమే ఐదొందలు నెలకి. అది ఎప్పుడో ఇచ్చేసిండు ఒస్మాన్ భాయ్. మల్ల అడుగుతే ఇస్తడా. కానీ అమ్మీ చెప్తే ఇనదు.

“పైసలు ఏ మూల దాచిపెట్టినా తీస్కపోతుండు మీ అబ్బా. ఇంట్ల జాగలు దొర్కుతలేవు. ఇంతమందిని ఏడికెల్లి సాకాలె.” ఇంకా సదువుతనే ఉంది అమ్మీ.

“సరే అమ్మీ. అడిగి చూస్తా.” అని అరుచుకుంటానే ఉరికిండు. ఏ మాటకి ఆ మాట. అమ్మీ ఎడుస్తే నచ్చదు రషీద్ కి. అందుకే అసుంటి టైంల ఇంట్ల ఉండడు. బయటికి ఉర్కుతడు.

* *

దిల్షాద్ కేఫ్ ల పని. పొద్దున్నే నాలుగు గంటలకు పోవాలె.. కప్పులు కడగాలే.టేబుల్లు తుడవాలే. ఒచ్చినోల్లకి చాయ్ ఇయ్యాలె. పని పెద్ద కష్టమేం అనిపించదు. ఒక పది పదకొండుకి ఇంటికి పోవొచ్చు. లేకుంటే అక్కడే పండుకోవచ్చు. మల్ల అయిదింటికి ఒచ్చేయ్యలె. రాత్రి అంతా అయ్యేవరకు పదయితది. రోజు ఇదే పని. కాని రషీద్ కి ఇదేం కష్టం అనిపించదు. కేఫ్ మొత్తం మీద అందరితో నవ్వుకుంట మాట్లాడేది మనోడే. ఎప్పుడు ఏ కష్టం ఉన్నట్టు కనిపించదు. ఎంత పని చెప్పినా హాయిగా చేస్కపోవడం ఒక్కటే తెల్సు.

ఈ పన్ల కుదరకముందు అబ్బా ఒక మెకానిక్ షెడ్ ల పెట్టిన్చిండే. ఒక పది రోజులు పని చేశిండు కాని రషీద్ కి నచ్చలే. రోజంతా పనే ఉంటది. ఇక్కడైతే నలుగురు ఒచ్చే పొయ్యే చోటు. వాళ్ళందరి మాటలు వినడం సరదా. నాలుగు విషయాలు తెలుస్తయి. పని చేసినట్టే అనిపించదు. అందరి మాటలు ఇనుకుంట పని మర్చిపోతడు అని ఒస్మాన్ భాయ్ చాలా సార్లు తిట్టిండు కూడా.

• *

ఐదు నిముషాలు నడిచేసరికి కేఫ్ ఒచ్చేస్తది. మెయిన్ రోడ్డు పైన హనుమంతుని గుడి పక్కన. షెటర్లు అన్ని సగం సగం తెరిచి ఉన్నయి. లోపల్నించి లైట్ ఒస్తుంది. దబదబ లోపలికి ఉరికిండు. ఫెరోజ్ భాయ్, మల్లేష్ అన్న అప్పటికే ఒచ్చేశిన్రు. పని షురూ కూడా చేశిన్రు. మెల్లంగ పొయ్యి బట్ట తీస్కోని టేబుల్లు అన్ని సరిగ్గా పెట్టి సాఫ్ చెయ్యడం షురూ చేశిండు.

" ఏం రా రషీద్. ఈ మధ్య రోజు లేట్ ఐతుంది. నీకు బాగా...." తిట్టుడు మొదలు పెట్టిండు ఒస్మాన్ భాయ్.

"అట్ల ఏం లేదు భాయ్. మా అమ్మీ ...."

ఒస్మాన్ భాయ్ మాట వింటలేడు. పన్ల పని అందరినీ తిట్టేస్తె  కాని కోపం తగ్గదు. ఎప్పుడు కోపం ఒచ్చినా అంతే.

"నువ్వొచ్చే దాంక ఆగాల్నా లేకుంటే నీ పని నేనే చెయ్యాల్నా. పిలిచి పనిస్తె ఇట్లనే ఉంటది రా. మీ అయ్యా ఇంట్ల కష్టం అయితుంది, పిల్లగాడు పని లేకుండా బేగర్దాగా తిరుగుతుండు, పెట్టుకో అంటే దయతలిచి పెట్టుకున్న కదా. ఇప్పుడు కడుపు నిండుతుంది కాబట్టి పని చెయ్యాల్నంటే బద్ధకంగనే ఉంటది. మల్ల ఎండితేకానీ మీకు పని విలువ తెల్వదు."

ఇంక బూతులల్లకే దిగిండు. రషీద్ గాని ఇంట్ల అందరిని కలుపుకొని తిడ్తుండు.

"పోనీలే ఒస్మాన్ భాయ్. చిన్న పిల్లగాడు. ఒచ్చిండు కదా." లోపలికి ఒస్త ఒస్త అన్నడు శబ్బీర్ భాయ్. మా కేఫ్ పక్కన పాన్ డబ్బా పెట్టుకుండు. "మొన్న మొన్ననే చేరిండు కదా నేర్చుకుంటడు లే."

"అరే నీకు తెలవదు షబ్బీర్. పనిచ్చే దాక కాళ్ళు పట్టుకుంటరు. పనిచ్చినంక గల్ల పట్టుకుంటరు."

షబ్బీర్ భాయ్ మంచోని లాగ అనిపిస్తడు. అప్పుడప్పుడు ఉత్తిగ మీఠపాన్ ఇయ్యమంటే ఇస్తడు. మంచిగ మాట్లాడ్తడు. అబ్బాకి ముందే తెల్సంట. అందుకనే అప్పుడప్పుడు ఇంటి విషయాలు అడిగుతుంటడు.

ఒస్మాన్ భాయ్ ఒక పది నిముషాలు తిట్టి అట్లనే బయటికి పోయిండు ఏదో పని మీద. ఈ లోపల చాయ్ గిన్నెలు కడిగేసి, టేబుల్లు తుడిచేసి, కుర్చీలన్ని సర్దేశిన. లోపల, బయట జాడు కొట్టేశిన. మెల్ల మెల్లగ జనాలు ఒస్తున్రు.

• *

హైదరాబాద్ ల కేఫ్ లకి అన్ని రకాల మంది ఒస్తరు. పైసాలున్నోల్లు, లేనోళ్ళు, పైసలు సంపాదించాలి అనుకునేటోళ్ళు, ఏ పని లేకుండా బేకార్ గా తిరిగేటోళ్ళు, పెద్ద పెద్ద కలలు కనేటోళ్ళు, దునియా మంది ఒస్తరు. వాళ్ళందరి మాటలు విసే రషీద్ గాడు తనకు తెలిసినవన్ని నేర్చుకునేది. చాలా మందిని గుర్తుపడతాడు. వాళ్ళు కూడా పేరు పెట్టి పిలుస్తరు. కాని కొత్త కొత్త మనుషులు ఒస్తేనే మజా, వాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారో వినాలనిపిస్తది.

కేఫ్ నిండింది. 2 బై 4 చాయ్... 3 బై 4 చాయ్...  బిస్కిట్.....సమోసా.... టేబుల్ సాఫ్ చెయ్యి...కుప్పు సాసర్ల టంగ్ టంగ్ అని సప్పుడు, సిగరెట్ పొగ ఇవన్ని కలిసిపోయినయి. రషీద్ తన పనిల పడ్డడు.

టేబుల్ 1:

ఇస్త్రీ బట్టలు టక్ చేస్కోని, అద్దాలు పెట్టుకొని, జుట్టు నున్నగా దువ్వుకున్నాయన ఒకాయన ఒచ్చి కూర్చుండు. రషీద్ ఒచ్చేప్పటికి ఫోన్ తీసి మాట్లాడుతుండు.

“ఆ..నేనోచ్చేశ్న...అదే దిల్షాద్ కేఫ్ ల ఉన్న. ఒస్తున్నవా..మంచిది.. ఈడనే ఉంటా.”

“రెండు చాయ్ తీస్కరా.. కుప్పులు నీట్ గా ఉండాలే. మంచిగ కడిగి తే” రషీద్ దిక్కు చూస్కుంట చెప్పిండు.

“సరే సాబ్.” అని ఉరికిండు రషీద్.

టేబుల్ 2 :

“అరేయ్ రషీద్. 2 బై 4 చాయ్ తేరా...” అని అరిచిండు శ్రీకాంత్ అన్న. కాలేజ్ ల చదువుకుంటరు. అప్పుడప్పుడు దోస్తులందరు ఒస్తరు. అందర్ల ఎక్కువ మాట్లేడేది శ్రీకాంత్ అన్ననే.

“ సరే అన్నా.” అనుకుంట పోయిండు రషీద్.

పెద్ద ట్రేల 6 కప్పులు. రెండు నిండగా. 4 సగం కన్న కొంచం ఎక్కువ నింపుకొని ఒచ్చిండు రషీద్.

రెండు ఫుల్ చాయ్ లు ముందు టేబుల్ మీద పెట్టిండు.

టేబుల్ 1:

అప్పటికే అక్కడ మల్లేష్ సేఠ్ ఒచ్చి ఉండు. ఈయన రషీద్ కి ఏర్కనే. అప్పుడప్పుడు ఒచ్చి పోతనే ఉంటాడు కేఫ్ కి.

“ఎక్కణ్ణుంచి సార్. ఏ ఊరు మీది.” అడిగిండు మల్లేష్.

“హైదరాబాద్ పక్కన్నే. ఇబ్రహింపట్నం. సిటీకి ఒచ్చి చాలా ఎండ్లయిపోయింది అనుకో.” చాయ్ కుప్పు చేతిలకి తీస్కున్నాడు ఇస్త్రీ బట్టలాయన.

“అచ్చా. ఆడనా. మా చిన్నాయనోల్లు అటు దిక్కే ఉంటరు. దండుమైలారంల. సరే చాయ్ తాగున్రి.” అని చేతులు ఎన్కకి పెట్టి సుకూన్ గ కూసుండు మల్లేష్ సేఠ్.

“ఎన్నేండ్లనుండి చేస్తున్రు ఈ కంపెనీల.” మల్ల అడిగిండు మల్లేష్.

“ఒక నాలుగయిదు ఏండ్లయితుంది.” జేబులనుంచి కార్డు తీసి ఇచ్చిండు ఇస్త్రీ బట్టలాయన.

“ ఇంతకుముందు ఇననట్టున్న సార్ మీ కంపెనీ గురించి. లేదు.” కార్డు సూడకుండనే అన్నడు  మల్లేష్.

“అంటే. ఉంది కాని అంత పెద్దగా వ్యాపారం ఇంకా లేదు. చిన్న చిన్నగా చేస్కుంట ఒస్తున్నం.” అని బ్యాగ్ లనుంచి  ఏవో పేపర్లు తీసి  చూపెట్టిండు.

టేబుల్ 2:

“అరేయ్ రషీద్. చాయ్ చేతిల పట్టుకొని ఇయ్యవెంది రా.” గట్టిగ అరిచిండు ప్రశాంత్ అన్న.

దబదబ ఈ టేబుల్ కాడికి ఒచ్చి చాయ్ ఇచ్చిండు రషీద్.

ఏమన్న అనేలోపల్నే “బాగ కొవ్వు వట్టింది గదా. అట్లనే చేస్తం మేము.” కౌంటర్ ఎన్కనించి కోపంగ చూస్తుండు ఒస్మాన్ భాయ్.

గట్టిగ నవ్వి, “పోనీలే ఒస్మాన్ భాయ్. చిన్న పిల్లోడు.” అని చాయ్ తీస్కుండు.

“అయితే సినిమా దొబ్బిందా?” పక్కనున్న దోస్తుని అడిగిండు.

“అబ్బా.... సావగొట్టిండు రా బాబు. అదేందో వాని బాధ.” అన్నాడు ఒక దోస్తు.

“హౌల గాడు. ఒక్క నిమిషం కూసోలేకపోయినం థియేటర్ల. ఏం తిక్కరా అయ్యా ఆ డైరెక్టర్ గానికి. అంత స్లో సినిమా ఉంటే ఎవడు సూస్తడు రా ఇయ్యాల రేపు.”, ఇంకోడు.

“ఏం సినిమా పోయిన్రు అన్నా. తెలుగా హిందియా?” జోష్ తోటి అడిగిండు రషీద్.

“తెలుగేరా. దిమాఖ్ ఖరాబ్ అయ్యింది.”

“ఒక్క పాట సక్కగా లేదు. హీరోయిన్ని సరింగ చూపెట్టలేదు. కామెడీ కూడా లేదు. ఇన్ని రోజుల నించి ఊదరగొట్టి ఇదా తీసేది.”

“బానే ఉంది కద రా. నాకు నచ్చింది. థ్రిల్లర్  అది. దాంట్ల కామెడీ అది ఇది ఉంటె బోర్ కొడ్తది. ఇట్ల తియ్యడమే కరెక్ట్. ఆ ట్విస్ట్ మాత్రం నాకు మస్తు నచ్చింది. ఎప్పుడో కాని రావు ఇట్లాంటి సినిమాలు. ఎంత సేపు దమ దమ బాడుకోడమే కాదు కద.” అప్పట్నించి సప్పుడు చెయ్యకుండా కూర్చున్న ఆఖరోడు మాట్లాడిండు.

“ఒచ్చిండు చూడు బే. కథ ఎవనిక్కావాలే. మేమడిగినమా. మాకు కావాల్సింది మావోడిని మంచిగా చూపెట్టటం. కతర్నాక్ పాటలు ఉండాలి. ఒక రెండు మూడు ఫైట్లుండాలె. ఈ ఏడ్సుడు తుడ్సుడు ఎవడు చూస్తడు బే. అసలు ఒక్క కామెడీ సీన్ అన్నా ఉందార సరిగ్గా..మీకు అర్థం అయితే చాలా. అందరికి అర్థం కానక్కర్లేదా?”

“అట్లా కాదు రా. మీ ఓడు కూడా బాగా చేశిండు కదా. క్లైమాక్స్ ల చాలా బాగా అనిపించింది నాకు.”

“ఏం చేశిండు బే. ఎవడన్న హీరో అట్లా ఏడుస్తడారా? ఇదేమన్న తమిళ్ సినిమానా. తిక్క లేశింది నాకు వాడు ఏడ్వంగనే.”

తలకాయ మీద దం అని ఒక దెబ్బ పడ్డది రషీద్ కి.

"ఆడ పక్కన టేబుల్ మీద జనాలు ఒచ్చి కూసున్రు. వాళ్ళ సంగతి చూడకుండ, మల్ల ఈడ ముచ్చట్లు ఇంటున్నవా బే." ఇంకో టేబుల్ దిక్కు సూపించి అడిగిండు ఒస్మాన్ భాయ్.

టేబుల్ ౩ :

అక్కడ అప్పటికే ముగ్గురు కూర్చొని మాట్లాడుకుంటున్రు. దెగ్గరికి పోయిండు. సలీమ్ భాయ్.. సలీం భాయ్ మంచిగ పెహల్వాన్ లాగా ఉంటడు. దూరం నించిన జల్దీ గుర్తుపట్టెయ్యొచ్చు. ఇంకెవరో ఇద్దరు ఉన్నరు. ఒకాయన సలీంభాయ్ పక్కన ఉండు. ఇంకో ఆయన ఎదురుంగ ఉండు.

" 2 బై ౩ చాయ్ తేరా." గుర్తుపట్టనట్టే చెప్పిండు సలీంభాయ్, అస్సలు నవ్వకుండా.

టేబుల్ 1:

"చూడు సార్. అందరికి చెప్పేదే చెప్తున్నా. మా ఆఫీస్ ల నెలకి నాలుగయిదు సార్లయినా ఆర్డర్ చేస్తం. నువ్వు ఆర్డర్ కి వెయ్యి రూపాయలు కట్టేశెయ్. మిగితాది నేను చూస్కుంట." సిగరెట్ పొగ ఒదులుకుంట అన్నాడు మల్లేష్.

"వెయ్యి రూపాయలంటే జెర ఎక్కువ మల్లేష్. కొంచం చూశి చెప్పు. మనం ముంగట కూడా ఇంకా చాల చెయ్యాలి. కలిసి పని చెయ్యాలె." అని నసిగిండు ఇస్త్రీ బట్టలాయన.

"అదే సార్. అందుకే కదా చెప్తున్న. మీరు బాగుండాలె. మేమూ బాగుండాలె. అయినా ఇంత కర్రెక్టు ఇంత కాదు అని చేప్పనీకె నా చేతిల ఏముంటది. అయినా వెయ్యి రూపాయలంటే ఏముంది ఇయ్యాల రేపు. మీ కంపెనీ ఓల్లకి ఒచ్చే లాభం ముందు ఇదెంత. చిల్లర కూడా కాదు."

"అది కరెక్టే అనుకో. కాని చూడు కొద్దిగా." అని జేబులోంచి ఫోన్ తీశిండు ఇస్త్రి బట్టలాయన.

"సరే మల్ల. ఆలోచించుకోండి. వాళ్ళకి ఫోన్ చేసి అడిగి చెప్త అన్నా ఫరవాలేదు. బలవంతం ఏముంది ఇందుల." అని లేవ్వబోయిండు మల్లేష్.

“అరే. అట్ల గుస్సా గాకు సేర్. ఫోన్ ఏం అక్కర్లే. అన్ని మాట్లాడుకొనే ఒచ్చిన మా కంపెనీ వాళ్ళతోని. సరే అయితే ఫిక్స్ మల్ల. మాకేం ప్రాబ్లం లేదు. ప్రతి ఆర్డర్ కి వెయ్యి ఇచ్చేస్తం. ఇట్లనే ఏడనన్న కలుద్దాం అప్పుడప్పుడు. ఇంకా ఎమన్నా ఉంటె కూడా చూడు.”

“ఆ.. బిల్కుల్. చెప్త. టచ్ ల ఉండన్రి.” నవ్వింది మల్లేష్.

అట్లనే పక్కన నిలవడ్డ రషీద్ ని అప్పుడు గమనించిన్రు ఇద్దరు. కప్పులు తీసి టేబుల్ సాఫ్ చేసింది రషీద్.

“ ఏం చేస్తం మల్లేష్ సేర్. ఎంత కష్టపడ్డా ఏం రాదు. ఏదో జీతం కోసం చేశేటోల్లం. మీ పనే బెస్టు.” బ్యాగ్ తీస్కుంట అన్నడు ఇస్త్రీ బట్టలాయన.

“అరే. మాదేముంది సార్. మీ లెక్క ఇస్త్రీ బట్టలు టక్ చేస్కోని చేసే ఉద్యోగమా. ఏదో ఫ్యాన్ ని. ఫ్యాన్ లాగ ఉండాలె. మంచిగా సదువుకుంటే మంచి ఉద్యోగాలు ఒచ్చేటివి. సదువుకోలె. సరేలే కలుద్దాం మల్ల.” అని నమస్తే పెట్టింది మల్లేష్.

ఇద్దరు బయల్దేరిన్రు.

రషీద్ కూడా ఒక్క నిమిషం మల్లేష్ దిక్కు చూసి కప్పులు కదగనీకె లోపలికి పోయింది.

టేబుల్ 2

“పోనీ లేరా. ఊకే లొల్లి. సినిమాని సినిమాలాగా చూడు. మర్చిపో. రోజంతా ఏడుస్తపేంది బే. నీ సొమ్మేమో పోయినట్టు.” ప్రశాంత్ అన్న కొంచం కోపంగా అన్నడు.

“అరేయ్. వన్ ఇయర్ నించి ఎదురుచూస్తున్నాం. ఒక వారం నించి అయితే ఇదే పిచ్చి. వేరే పని ఏం లేనట్టు. మొత్తం ఆ సినిమా ముచ్చట్లతోనే గడిచిపోయింది. ఫీల్ అవ్వొద్దు అంటే ఎట్లా”

“ఎవడు చెయ్యమన్నడు అట్ల. పోయినమా, చూశ్నమా అన్నట్టుండాలె. పర్సనల్ అయితపేంది బే”

“ఫాన్స్ కి ఆ మాత్రం బాధ ఉండదా. ఇంటర్నల్ ఎగ్జామ్ కూడ డుమ్మా కొట్టిన దీని గురించి. మా అయ్యకి తెలిస్తే సంపేస్తడు.”

“ఎట్లా తెలుస్తది. పొద్దున్నించి రాత్రి దాంక షాప్ లనే ఉంటడు కదా.”

“అదే తెల్వదనుకో. కాని టికెట్ కోసం చాల కష్టపడ్డ రా బాబు. ఎప్పుడు ముందే బుక్ చేస్కుంట. ఈసారి మిస్ అయింది. మా ఫ్రెండ్ గాడు ఫ్యాన్ షో కి ఇప్పిస్త కూకట్ పల్లిల అన్నాడు. వాడు కూడా హాత్ ఇచ్చిండు. ఇంక గతి లేక వెయ్యి రూపాయలు పెట్టి బ్లాక్ ల కొన్న.”

“వెయ్యి రూపాయలు పెట్టి సినిమా చూశ్నవా?” ప్రశాంత్ అన్న నోరు తెరిచిండు.

“ప్రతి సారి ఏదో ఒకటి అరేంజ్ చేస్కుంట రా. ఈసారి కుదరలే.”

“అయితే మాత్రం. ఒక రెండు మూడు రోజులు ఆగుతే ప్రాణం పోతదా రా?”

“ఇంకా ఆ టైంల ఏం అర్థం కాలే రా. చూడాలి అనిపించింది. చూశేశ్న.”

“కాని మరీ వెయ్యి రూపాయలు ఏంది బే. 10 సినిమాలు చూడొచ్చు. అన్ని పైసలు ఎక్కువయినయా?”

“అది కూడా మా షాప్ గల్లానించి తెచ్చిన. ఇప్పుడు మా అయ్యకి తెలిసిపొయ్యి ఉంటది. ఇంటికి పొయ్యి ఏం చెప్పాలె అని ఆలోచిస్తున్నా.” నవ్విండు దోస్తు.

“ఏమో రా భాయ్ మీ ఫాన్ల లొల్లి. నాకెప్పుడూ అర్థం కాదు.” ఇంగ లేశిండు ప్రశాంత్ అన్న.

అప్పటిదాంక అక్కడే ఉండి వింటున్న రషీద్ టేబుల్ క్లీన్ చేశిండు.

టేబుల్ ౩:

రషీద్ చాయ్ ఇచ్చేశిండు. సలీం భాయ్ మెల్లగ చాయ్ కుప్పు తీస్కోని తాగకుండ ఎదురుంగ ఉన్నోడిని అడిగిండు, “ఏం పేరు రా నీది?”

“రమేష్ అన్నా.”

“ఆహా... ఏం చేస్తాడు రా మీ అయ్య?”

“గవర్నమెంట్ జాబ్ అన్నా. కండక్టర్.”

“మరి సక్కగ సదువుకోకుండా ఈ నకరాలు ఎందుకు రా మల్ల.” ఒక్కసారి గొంతు పెంచి అడిగిండు సలీం భాయ్.

“నేనేం చేశ్న అన్నా.” కొంచం భయపడుకుంటనే చెప్పిండు.

“మా ఓడు చెప్తుండు. పోరి ఎనక పడ్తున్నవంట?”

“ ఎనకపడుడు అట్ల ఏం లేదు అన్నా. ఆ పిల్లకి గుడ నేనంటే ఇష్టమే. ఆమేనే ఒస్తది కలుస్తది. మంచిగనే ఉంటది నాతోటి. నేనేం ఆ పిల్లని పరేషాన్ చేస్తలే.” కొంచం గట్టిగా చెప్పిండు ఈసారి.

“ఏం రా దేడ్ హుషియారి చేస్తున్నావా?ఒక్కటే చెప్తున్నా. ఆ పోరితో మాట్లాడుడు బంద్ చెయ్యి. అంతే”

“ఎందుకన్నా?”

“ఎందుకు గిందుకు. ఇసుంటి బక్వాస్ మాటలు మాట్లాడకు. ఆపెయ్యి అంటే ఆపెయ్యి.”

“ఆ పిల్లకి కూడా నేనంటే ఇష్టం అని చెప్తున్నా కదా”

“అంత అబద్ధం అన్నా. ఆ పిల్లకి నేనంటే ఇష్టం. వీడే మధ్యల ఒచ్చిండు.” సలీం భాయ్ పక్కనున్నోడు అన్నాడు.

“కాదన్నా. కావాలంటే ఆ పిల్లనే అడుగున్రి. వీడే మీకు ఏదేదో చెప్పిండు.”

“అరే హాట్... నేనేమన్నా పెళ్ళి చేస్తున్ననారా ఇక్కడ. ఒక్క కాన్ బైరి కొట్టిననా అంటే తెలుస్తది నువ్వెవరో పోరి ఎవరో. బంద్ చెయ్యి అంటే బంద్ చెయ్యి. మల్ల నీ గురించి వీని దెగ్గర ఇనిపియ్యొద్దు బిడ్డా.”

వాడు ఏం మాట్లడలే.

“సడువుకునే పిల్లగానివి నీకెందుకు రా ఇవన్ని. సమఝ్ అయ్యిందా? చల్ నడువు ఇంకా”

వాడు లేశి ఎల్లిపోయిండు.

“షుక్రియా సలీం భాయ్. వాడేదో సడువుకునేటోడు. నీతో చెప్పించే పని లేకుండే. కాని నేను రెండు మూడు సార్లు చెప్పి చూశ్న. ఇనలే. అందుకే నిన్ను అడిగిన.” పక్కనున్నోడు నవ్వుకుంటా చెప్పిండు.

“ఏం కాదు లే. భయపడ్డాడు ఇప్పుడు. ఆ పోరి జోలికి పోతే చెప్పు ఈసారి వేరేలాగా చెప్తాం.”

“అంత సీన్ లేదు లే. ఆ అవసరం పడదు. థాంక్స్ అన్నా సేల్” అని చెప్పి, వెయ్యి రూపాయలు తీసి సలీం భాయ్ కి ఇచ్చిండు.

ఆ పైసలు తీస్కొని జేబులో పెట్టుకుండు. రషీద్ ని గరెట్ తెమ్మని పంపించిండు.

• * *

రాత్రి అయ్యింది. కేఫ్ కూడా దాదాపు ఖాళీ అయ్యింది. రషీద్ కూడా బాగా అలిసిపొయ్యిండు. పొద్దున్నించి ఒస్మాన్ భాయ్ చేతిల నాలుగయిదు సార్లు తిట్లు కూడా పడ్డడు. గట్టిగా. పైనించి ఇయ్యాల కలెక్షన్ సరిగ్గా లేదని ఒస్మాన్ భాయ్ గుస్సా అయితుండు. లోపట పనేం లేదని రషీద్ కూడా జెర గాలి కోసం బయటికి ఒచ్చి మెట్ల మీద కూర్చుండు. సల్లగా గాలి ఒస్తుంది. హాయిగా ఉంది. షబ్బీర్ భాయ్ కూడా పాన్ డబ్బా బంద్ చేస్కుంటుండు.

“ఏం రా రషీద్. ఏం నడుస్తుంది?” పలకరించిండు  షబ్బీర్ భాయ్.

“ఏం లేదు షబ్బీర్ భాయ్. అమ్మ రెండు మూడు వందలు ఉంటె అడుక్కొని రమ్మన్నది. అసలే ఒస్మాన్ భాయ్ కోపంగా ఉన్నడు. పొద్దున్నించి రెండు మూడు సార్లు తిట్టిండు కూడా. ఎట్ల అడగల్నో అర్థం అయితలేదు. అదే ఆలోచిస్తున్నా”

“అయ్యో... లేవు బేటా నా దెగ్గర కూడా. ఇయ్యాల దందా సక్కగా కాలే. టీవీల మంచి సినిమా ఒచ్చినట్టుంది. ఎక్కువ మంది రాలే. అడిగి చూడు ఒస్మాన్ భాయ్ ని”

“అమ్మో.. ఒద్దులే. ఎట్లనో అట్ల అమ్మీకే సర్దిచెప్తా.”

“అరే. పరేషాన్ గాకు రా భాయ్. ఏమనదు మీ అమ్మీ. ఎదో ఒకటి అయితది. అన్నిటికీ దేవుడున్నాడు. పాన్ తింటావా?” అని పాన్ చుట్టి రషీద్ కి ఇచ్చిండు.

ఇంతలోకి ఒక పెద్ద ఎర్ర కారొచ్చి కేఫ్ ముందు ఆగింది. అది చూడంగనే ఒస్మాన్ భాయ్ లోపల్నించి ఉరుక్కుంట ఒచ్చిండు. అందులనించి నలుగురు దిగిన్రు. చూస్తే చానా డబ్బులున్నోల్ల లాగ ఉన్నారు.

“అరే అరే. నమస్తే సాబ్. ఎన్ని రోజులకి దయ కలిగింది మా పైన. అసలు మర్చేపోయ్యిన్రు మా కేఫ్ దిక్కు ఒచ్చుడు. ఎన్ని రోజులాయె దర్శనం లేక” అని ఎదురొచ్చిండు.

“ఏం లేదు ఒస్మాన్ భాయ్. కష్టం ఐపోయింది ఈ మధ్య. టైం ఉంటలేదు.”

“అంతే. ఎమ్మెల్యే సాబ్ కి టైం ఎక్కడ ఉంటది. కాని అప్పుడప్పుడు మా అసుంటి ఓల్లని కూడా పలకరిస్తున్నాలే.”

“అరే. ఎందుకు ఒస్మాన్ భాయ్ అట్ల పిలుస్తావ్. నీకు తెల్సు కదా. ఎమ్మెల్యే నేను కాదు. మా నాన్న.”

“ఇప్పుడు మీ నాన్ననే సాబ్. కాని నెక్స్ట్ ఎలక్షన్ కి మీరు అయిపోతారు. చెప్తున్నా కదా నేను.  అది మాత్రం ఎవ్వరు ఆపలేరు.”

“అప్పటికి చూస్కుందాం ఒస్మాన్ భాయ్. కాని ఇప్పుడు పిల్వకు అట్ల. ఎవడయినా ఇంతే నవ్వుతాడు. నువ్వొక్కడివే అట్ల పిలుస్తవ్.”

“సరే చాయ్ తగుకుంట మాట్లాడుదురు రండి.” అని అందరినీ లోపలికి తీస్కపొయ్యిండు ఒస్మాన్ భాయ్.

ఈ సార వాళ్ళు ఎప్పుడయినా ఒక్కసారి ఒస్తుంటరు కేఫ్ కి. ఇదే టైంకి ఒస్తుంటరు. కొంచం సేపు ఉంది పోతరు. ఒచ్చినప్పుడు స్పెషల్ చాయ్ స్పెషల్ కప్పులల్ల తీస్కోని పోవాలె. రషీద్ కి తెల్సు కాబట్టి పనిల పడిపొయ్యిండు.

చాయ్ తీస్కొచ్చి ఇచ్చిండు అందరికి.

“ఏదేమయినా నీ చాయ్ టేస్ట్ ఎక్కడ రాదు భాయ్.” చాయ్ తగుకుంట అన్నాడు ఎమ్మెల్యే సాబ్.

“ఏదో మీ అభిమానం సాబ్. లేకపోతే ఎక్కడెక్కడో తిరిగేటోళ్ళు మీరు. గుర్తుపెట్టుకొని మరీ నా చాయ్ కోసం ఒస్తున్రంటే అది మీ గొప్పతనం.” సిగ్గుపడ్డడు ఒస్మాన్ భాయ్.

“ఇంకేం సంగతులు. దందా ఎట్లా నడుస్తుంది?”

“మీ దయ వాళ్ళ బానే ఉంది సాబ్. ఏదో చాయ్ పానికి నడిచిపోతుంది. పోలీస్ ఓళ్ళు మాత్రం మరీ టైంకన్నా ముందే బంద్ జెయ్యమని లొల్లి జేస్తున్రు. మీరేమన్న చెప్పున్రి రాదు సాబ్.”

“ఆ.. ఈ మధ్య వాళ్ళు స్ట్రిక్ట్ ఉంటున్రు ఒస్మాన్ భాయ్. ఏం చెయ్యలేం.”

“ఇంక సాబ్. పెద్ద సాబ్ మంచిగున్నరా?”

“ఆ బాగుండు. అడుగుతుంటడు అప్పుడప్పుడు మీ గురించి, కేఫ్ గురించి.”

“పెద్ద సాబ్ కేంది ఒస్మాన్ భాయ్. ఎప్పుడు ఎలక్షన్ అయినా గెలుచుడు ఖాయం. పబ్లిక్ ల కతర్నాక్ ఇమేజ్ ఉన్నది.” పక్కనున్న దోస్తు అన్నడు.

“అరే ఇయ్యాల రేపు అట్ల ఏం లేదు రా. పబ్లిక్ కూడా నీయత్ లేకుండా ఉన్నరు. ఎంత చేశినా ఒచ్చే ఎలక్షన్ కి మల్ల కొత్తనే. నీకు తెల్సా ఒస్మాన్ భాయ్. మన బస్తీకి ఎంత చేశ్నం కదా. అయినా మల్ల ఓటుకి వెయ్యి రూపాయలు ఇస్తే గాని ఎయ్యాలే ఎవ్వడు.” ఏమ్మెల్యే సాబ్ చెప్పిండు.

“వెయ్యి రూపాయలా? ఒక్క ఓటుకి. అదేంది సాబ్. మరీ దారుణం.” ఆశ్చర్యపోయిండు ఒస్మాన్ భాయ్.

“ఏం చేస్తం. తప్పుతలేదు. లేకపోతే ఎంత మంచిగ పని చేశినా ఎవ్వడు ఓటు ఎయ్యట్లేదు.”

ఇంక జెర సేపు అట్లనే మాట్లాడుకున్నరు రాజకీయాల గురించి. రషీద్ బయటికి పొయ్యి మెట్ల మీద కూసోని కునికి పాట్లు పడుతుండు. టైం అయిందని ఒస్మాన్ భాయ్ షెటర్లు సగం మూసేసిండు ఒస్మాన్ భాయ్.

తరవాత అందరు బయటికి ఒచ్చిన్రు.  రషీద్ టేబుల్ క్లీన్ చేసి కప్పులు తియ్యనీకె పోయిండు. ఒస్మాన్ భాయ్ అందరికి నమస్తే పెట్టిండు. అందరు కారెక్కిన్రు. ఏదో గుర్తొచ్చి మల్ల దిగిండు ఎమ్మెల్యే సాబ్. జేబులోంచి పైసలు తీసి ఒస్మాన్ భాయ్ కి ఇయ్యబోయిండు. ఒస్మాన్ భాయ్ ఒద్దు అంటున్నట్టుంది. దూరం నించి కాబట్టి మాటలు వినిపిస్తలే రషీద్ కి. కాని చూస్తే అట్లనే ఉంది. మొత్తానికి మొహమాటం మీద పైసలు తీస్కుండు ఒస్మాన్ భాయ్. మల్ల కారెక్కినంక ఒస్మాన్ భాయ్ ఒచ్చేశిండు.

కాని ఇద్దరు చూస్కోనిది ఏందంటే ఒస్మాన్ భాయ్ కి పైసలు ఇచ్చి ఎక్కేలోపు చేతిలోంచి ఒక వెయ్యి రూపాయల నోటు జారి కింద  పడిపోయింది. అది ఎవ్వరు చూస్కోలే. రషీద్ చూసిండు కేఫ్ లోపల్నించి. అరిచేలోపల కారు స్టార్ట్ అయిపోయింది. రషీద్ చేతిల ఎంగిలి కప్పులు ఉన్నాయి, కాని ఆ నోటు దిక్కు ఉరికే జోష్ ల అది పట్టించుకోలే. కారు మెల్లగ ముందుకు పోవడం శురు అయింది. ఒస్మాన్ భాయ్ మెట్లెక్కి ఇటు దిక్కు కేఫ్ లకి ఒస్తుండు. రషీద్ మెట్ల దాంక ఒచ్చేశిండు. కారు ముందుకు పొయ్యే గాలికి ఆ నోటు ఎగిరి టైరుకు అతుక్కుంది. చూస్తుండంగనే కారు, టైర్, నోటు మూడు ఎల్లిపోయినయి. మెట్ల మీదనుండి కింద పడ్డడు రషీద్.

తేరుకునేటప్పటికి రషీద్ కంట్ల నీళ్ళు. కింద ఇరిగిపోయిన కప్పు ముక్కలు ఉన్నయి. ఒస్మాన్ భాయ్ అరుస్తుండు.

“బద్మాష్. ఏమైంది రా. పిచ్చి పట్టిందా. ఏడికి ఉర్కుతున్నావ్. దీవానా గానివా. మీ అయ్య కట్టడా ఈ కప్పుల పైసలు.”

“కాదు భాయ్. ఎమ్మెల్యే సాబ్ పైసలు పడిపోయినయి. తీస్కునే లోపల ఎగిరిపోయినయి.”

ఒస్మాన్ భాయ్ నమ్మలే. తిట్టిండు.

• * *

రషీద్ అంత సాఫ్ చేసేసి షెటర్ బంద్ చేసి తాళం ఏశిండు. ఒస్మాన్ భాయ్ కూడా బండి స్టార్ట్ చేశిండు. రషీద్ నమస్తే చెప్పి ఇంటికి పోనికె గల్లీలకి నడిచిండు.

నడుస్తుంటే పక్కనించి ఒస్మాన్ భాయ్ బండి ఒచ్చి ఆగింది.

“అరేయ్ ఇందాక బజార్ పోతే మీ అమ్మీ కనపడ్డది. పైసలు అడగమన్నదంట నిన్ను. మల్ల అడగకుండనే పోతున్నవ్ ఏంది బే. ఇంగో ఈ మూడొందలు తీస్కో. ఇంట్ల ఇచ్చేయ్యాలె. సరేనా. పొద్దున్న జల్దీ రా.” అని పైసలు ఇచ్చేశి సర్ర్ అని బండి పెళ్లిపోయింది.

• * *

## 2. థాంక్ యూ

“ఏంటి రఘు. అంతా రెడీయా? ఎన్నింటికి ఫ్లైట్?” అడిగాడు తనతో పాటు పని చేసే కొల్లీగ్.

“రేత్రి తొమ్మిదికి. ఒక ఆరు గంటలకి ఇంటి నించి బయల్దేరితే సరిపోతుంది. ఇండియాకి వెళ్ళాలంటే ఎంత ఆనందంగా ఉంటాదో ఈ ప్రయాణం అంత కష్టంగా ఉంటది.”

“అవును ఈ మధ్య ఈ ఎయిర్పోర్ట్ సెక్యూరిటీ చెక్ కూడా చాల టైం పడ్తుంది. మొత్తం ఇండియా వెళ్లేసరికి దాదాపు ౩౦ గంటలు పడుతుంది. నేను వెళ్ళడం కాస్త తగ్గించడానికి ఇది కూడా ఒక కారణం.”
“కానీ, అంత అలిసిపొయ్యి ఉంటామా..ఒక్క సారి ఇండియాలో అడుగుపెడితే చాలు అదంతా మరిచిపోతా నేను.” రఘు కళ్ళల్లో ఒక మెరుపు.

చిన్న నవ్వు నవ్వాడు కొల్లీగ్. “నేను ఇచ్చిన ప్యాకెట్ పెట్టుకున్నావ్ కదా? ఇండియాలో దిగగానే చెప్పు మా తమ్ముడు ఒచ్చి తీస్కుంటాడు. థాంక్స్ అగైన్. కొంచం బరువు ఎక్కువే, ఐనా తీసుకెళ్తున్నందుకు.”

“ఫరవాలేదు. ఆఫీస్ లో అందరి పాకెట్స్ కలిపి ఒక ౩౦ పౌండ్ల దాకా అయ్యింది. అయినా ప్లేస్ ఉందిలే లగ్గేజ్ లో.”

“మరి ఇంకా ఎందుకు ఉన్నావ్. ఆల్రెడీ ౩ అయ్యింది. లాగించేయ్ ఇంకా.”

“అదే అనుకుంటున్నా. ఇవ్వాళ అసలు పనే చెయ్యలేను. ఎంత సేపున్నా దండగే. ఉంటా మరి.” అని బ్యాగ్ సర్దుకోవడం మొదలు పెట్టాడు.

“ఓకే బాస్. హ్యాపీ జర్నీ. నా స్వీట్ ప్యాకెట్ మాత్రం తేవడం మర్చిపోకు.” అని ఒక నవ్వు నవ్వి వెళ్ళిపోయాడు కొల్లీగ్.

8 గంటలు కంప్యూటర్ ముందు కూర్చొని పని చెయ్యడం అంటే పెద్ద కష్టమైనదేమి కాదు. ఐనా రోజు ఆఫీస్ అయ్యాక ఇంటికి వెళ్ళేటప్పుడు ఏదో ఆనందం. అలాంటిది ఈ రోజు ఒక వెయ్యి రెట్లు ఎక్కువ ఉంటుంది. మళ్ళీ నెల రోజులకిగాని ఆఫీస్ మొహం చూడక్కర్లేదు. హాయిగా తన ఊళ్ళో, తన ఇంట్లో, తన వాళ్ళ మధ్యన

ఉంటూ, వాళ్ళు పెట్టేవి తింటూ గడిపెయ్యొచ్చు. ఒక స్పెషల్ ట్రీట్మెంట్ ఉంటుంది తెలిసిన వాళ్ళ ఎవ్వరింటికి వెళ్ళినా.

ఇండియాలో ఐటి ఉద్యోగం చేసే చాలా మంది కలలు కనే జీవితం రఘు దెగ్గర అప్పటికే ఉంది. అమెరికాలో చాలా మంచి ఉద్యోగం, ఆఫీస్ కి దెగ్గర్లోనే సొంత ఇల్లు. అందమైన, అర్థం చేసుకునే భార్య, ఆరంకెల జీతం, తన భార్య కూడా ఉద్యోగం చేస్తుంది కాబట్టి ఇంకో ఆరంకెలు, మొత్తం కలిపి కావాల్సినంత డబ్బు. వీటి వల్ల దొరకని సంతోషాన్ని ఇవ్వడానికి ఒక అయిదేళ్ళ కొడుకు. పేరు అద్విక్. ఇంటర్నెట్ లో వెతికి వెతికి ముద్దుగా పెట్టుకున్న పేరు.

• * *

“ ఏంటి ఇంకా ఇల్లంతా ఇలాగే ఉంది.” వాళ్ళావిడ తలుపు తియ్యగానే ఆశ్చర్యపోయాడు. ఇంకో రెండు గంటల్లో బయల్దేరే ఛాయలు ఎక్కడా లేవు.

“మరేం చెయ్యమంటావ్ . నాక్కూడా ఆఫీస్ నించి రావడం లేటయ్యింది. ఒచ్చినప్పట్నించి మీ పుత్రరత్నం చుక్కలు చూపిస్తున్నాడు.” విసుక్కుంది లక్ష్మి.

పుత్రరత్నం అనే మాట వాడిందంటే వీడు చాలా అల్లరి చేశాడన్నమాట. పాపం వాడు మాత్రం కావాలని చేస్తాడా.

“ఇంతకి ఏమయ్యింది.?”

“వాడి బొమ్మలన్నీ పెట్టాలంట పెట్టెలో. ఆ బాస్కెట్ బాల్ అయితే ఖచ్చితంగా పెట్టాలని అల్లరి చేస్తున్నాడు. అక్కడ దొరుకుతాయి అని చెప్పినా వినట్లేదు. నిన్న అంతా సర్దేద్దాం అని చెప్పినా వినలేదు. రోజూ వాడికి నేర్పే బాస్కెట్ బాల్ కదా ఒక్క రోజు మానేస్తే ఏమయ్యేది. ఇప్పుడు చూడండి.”

“సరే సరే. నేను చెప్తా కదా. వాడి బొమ్మలు ఏం పెట్టకు. దండగ. కావాలంటే అక్కడ కొనిస్తా అని చెప్తా లే. వాడింక నిన్ను డిస్టర్బ్ చెయ్యడు. తొందరగా సర్దెయ్యి.” అని లోపలి వెళ్ళాడు.

“వాడు ఇటు పక్క రాడు అంటే మీరు చేసేదేంటో నాకు తెల్సు. అయినా అయిదేళ్ళు కూడా సరిగ్గా లేవు వాడికి అప్పుడే బాస్కెట్ బాల్ ఎందుకంటా. సరిగ్గా పట్టుకోవడమే రావట్లేదు వాడికి. ఇప్పుడు ఎమోస్తుందనీ. ఇంకో అయిదేళ్ళు ఆగు.” మాట్లాడుకుంటూ బట్టలన్నీ పెట్టెల్లో కుక్కేస్తుంది.

“వాడికిష్టం, నాకూ ఇష్టం. నీకెందుకే మధ్యలో కుళ్ళు.” అని కొడుకుని వెతుక్కుంటూ వెళ్ళాడు.

“ముందు పని అంతా పూర్తి చెయ్యి. పెట్టెలు నీట్ గా సర్దు. మా అమ్మ ఎప్పుడూ అంటుంటది, మీరు ఇల్లు సరిగ్గా పెట్టుకోరు అని.” పక్క గది లోంచి కావాలనే అరిచాడు.

“ఒక్క అరగంట నా జోలికి రాకండి. ఆ తరవాత మీకు, మీ అమ్మగారికి, మీ పక్కింటి పిన్నిగారికి అందరికి నచ్చుతుంది.” అని పనిలో పడిపోయింది.

రఘు కూడా చిన్నప్పుడు బాస్కెట్ బాల్ ఆడింది లేదు. కొడుక్కి నేర్పుతూ తనూ నేర్చుకుంటున్నాడు. వాడికి ఇప్పుడే ఏమొస్తుంది. ఆ చిన్న చేతుల్లో బాల్ నిలబడితే అదే ఎక్కువ. దానికే చాల ఆనందపడిపోతాడు. ఓపిగ్గా ఎలా పట్టుకోవాలి, ఎలా పరుగెత్తాలి అన్ని చెప్తాడు. ఆ మురిపెంలో ఎప్పుడు అరగంట అయ్యిందో తెలియలేదు.

“నేను రెడీ, పెట్టెలు రెడీ, ఇల్లు రెడీ, మీరిద్దరే మిగిలింది” అని పిలిచింది లక్ష్మి. ఇద్దరూ గబగబా స్నానం కానిచ్చారు. మొత్తానికి టైంకే బయల్దేరారు. కారెక్కగానే పడుకున్నాడు అద్విక్.

“అబ్బా. ఇప్పుడు 20 గంటలు ఫ్లైట్లో కూర్చోవాలా? అసలే వీపు నొప్పిగా ఉంది?” అని నిట్టూర్చాడు రఘు.

“మరి ఎవరు ఆడమన్నారు. కాసేపు పడుకోవచ్చుగా. పైన కిల్లర్ ఇవ్వనా?” కంగారు పడింది లక్ష్మి.

“ఏమొద్దు. దీనికంటే పెద్ద కష్టం ఫ్లైట్లోనే ఉంటుందని భయం.”

“ఏంటి. ఏడ్చే పిల్లలా?” నవ్వింది లక్ష్మి.

అమెరికా నించి ఇండియా ఒచ్చే ఎవరికైనా తెలిసిన సంగతి ఏంటంటే ప్రతి సారి ఫ్లైట్ లో కనీసం ముగ్గురు పిల్లలైనా గట్టిగా ఏడుస్తుంటారు. వాళ్ళతోనే ప్రయాణం చెయ్యాలి. తప్పదు.

“పెళ్ళి కాకముందు గుర్తుందా లక్ష్మి? మనం అనుకునేవాళ్ళం, మనకు పిల్లలు పుట్టాక ఇలా చెయ్యకూడదు అని. కాని తప్పలేదు. పోయినసారి వెళ్ళినప్పుడు వీడు నరకం చూపించాడు.”

"ఇప్పుడు ఆ భయం లేదులే. కాస్త పెద్దవాడయ్యాడు."

"పైగా ఇక్కడ పిల్లల్ని గట్టిగా ఒక మాట కూడా అనలేం. నాకేమో ఓపిక తక్కువ."

"అబ్బా.. వీలుంటే ఏదో అన్నట్టు. అసలు వాడు నీ మాట ఎప్పుడయినా వింటాడా. నువ్వే వాడు చెప్పిందల్లా చేస్తావు. తండ్రీ కొడుకులు ఇద్దరూ ఒకటి. నేనొక్కదాన్ని ఒకటి." మూతి ముడుచుకుంది లక్ష్మి.

కాని రఘు ఎప్పుడూ అద్విక్ ని ఏమీ అనడో తెలుసుకోవాలి అనిపిస్తుంది లక్ష్మికి.

"కాని ఎందుకు వాడిని ఒక్క మాట కూడా ఆనవు ఎప్పుడూ. వాడు కోపం ఒస్తుంది అని భయమా." మెల్లిగా అడిగింది.

"అలా ఏం లేదు. మొన్ననే ఎప్పుడో కదా తిట్టాను."

"ఛా. ఎప్పుడు స్వామీ. నాతో మాత్రం అలా ఉండరు. కేవలం వాడితోనే."

"నీ బొంద."

"హ్మ్... చిన్నప్పుడు మామయ్య అంటే నీకు భయంగా ఉండేదా. అందుకే అద్విక్ కి అలా అవ్వకూడదని అని అలా చేస్తున్నారా?" చాలా రోజులనించి మనసులో ఉన్న ప్రశ్నని బయటపెట్టింది.

"ఎందుకు. మా నాన్నతో బానే మాట్లాడతా కదా నేను. ఆ డౌట్ ఎందుకు ఒచ్చింది.?"

"ఊరికే అడుగుతున్నా."

"అంటే చిన్నప్పుడు చాలా భయం ఉండేది. నాన్న ఎప్పుడు నన్ను కొట్టడం అలాంటివి చెయ్యలేదు. కాని నాన్న అంటే ఆ భయం అలా ఉండేది అంతే. అప్పట్లో ఎక్కువ మంది అంతే కదా."

లక్ష్మి ఏం మాట్లాడలేదు.

ఒక్క నిమిషం ఆగి, " అది కూడా ఇప్పుడు లేదు కదా. ఒక వయసు ఒచ్చాక నాన్న కూడా ఫ్రీగా ఉండడం మొదలు పెట్టారు." అన్నాడు.

కారు ప్రయాణం ఫ్లైట్ లోకి మారింది. టేక్ ఆఫ్ అవ్వగానే సరిగ్గా ముగ్గురు పిల్లలు రాగం అందుకున్నారు.

• * *

రఘు వాళ్ళ నాన్న రంగారావు. అమ్మ మీనాక్షి. రఘు చిన్నప్పుడు రంగారావుది క్లర్క్ జాబ్ అయినా గవర్నమెంట్ ఉద్యోగం కాబట్టి పెద్దగా కష్టాలేం లేవు. అలాగని గొప్పగా సుఖపడ్డదీ లేదు. అమ్మ ఇంట్లోనే. మామూలుగా గడిచిపోయింది చిన్నతనం. రంగారావు రిటైర్ అయ్యేనాటికి గజెటెడ్ స్థాయికి ఒచ్చాడు. ఆయనకీ పెద్ద కోరికలేం లేవు. రఘు అమెరికా నించి పంపిన డబ్బుతో ఇక్కడ ఆస్తులు కొంటూ, అమ్ముతూ, ఇల్లు కట్టడం పని చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడు. ఆనందంగా.

ఇండియా ట్రిప్ చాల బాగా జరుగుతుంది. అద్విక్ కూడా ఈసారి అందరినీ గుర్తుపడుతున్నాడు. కొత్త కొత్త విషయాలు నేర్చుకుంటున్నాడు. ఇంట్లో వాళ్లకి, చుట్టాలకి దేగ్గరయ్యాడు.

ఒకరోజు ఇంట్లో అందరు కూర్చొని మాట్లాడుతూ ఉండగా అద్విక్ దృష్టి హాల్ షెల్ఫ్ లోని ఒక షీల్డ్ మీద పడింది. పెద్ద షెల్ఫ్ మధ్యలో చాల జాగ్రత్తగా అందంగా పెట్టుకున్న షీల్డ్ అది.

“తాతయ్యా ఏంటి ఇది.?”

“అదా. మీ నాన్నకి గుర్తుందేమో అడుగు?” అని రఘు వైపుకి పంపించాడు.

రఘు షీల్డ్ ని చూశాడు. ఇన్ని రోజుల నించి అక్కడే ఉన్నా గమనించలేదు.

“అది మళ్ళీ బయటికి తీశారా. ఎందుకు నాన్న అదేదో పెద్ద నోబెల్ ప్రైజ్ లాగ.”

“సరే అదేంటో చెప్పు డాడీ.”

“ఏం లేదు నాన్న. చిన్నప్పుడు నాకు స్కూల్ లో ఇచ్చారు అంతే.” అని ముగించాడు రఘు.

"అలా చిన్నగా అంటావే రా? అద్విక్, మీ నాన్న మాథెమాటిక్స్ లో మొత్తం స్కూల్ లో అందరికంటే ఎక్కువ మార్కులు తెచ్చుకొని ఫస్ట్ ఒచ్చాడు. అందుకే ఇది ఇచ్చారు. స్కూల్ ఫస్ట్ కి ఇచ్చే షీల్డ్ అది. ఆ రోజు నించి మీ డాడీ మారిపోయాడు. ఎంసెట్ ర్యాంక్, ఇంజనీరింగ్ అన్నిట్లో టాప్." రంగారావు కళ్ళల్లో ఒక గర్వం.

"నిజమా డాడీ?" అద్విక్ కళ్ళు పెద్దవి చేస్కొని అడిగాడు.

"అదేమంత పెద్ద స్కూల్ కాదమ్మా." అని అద్విక్ ని దెగ్గర తీస్కున్నాడు.

తరవాత తండ్రితో, "పాతింట్లోంచి ఈ ఇంటికి ఒచ్చినప్పుడు పోయింది అనుకున్నా ఇది. బాలేదు నాన్నా. పాతది. తీసెయ్యండి ప్లీజ్."

"నీకది గొప్ప కాకపోవచ్చు రా. మాక్కు గొప్పే." అన్నాడు రఘు వైపు చూడకుండా

"అరేయ్. ఎవరైనా నీ జీవితంలో ఏం సాధించావు అని నన్ను అడిగితే నేను తడుముకోకుండా చూపించేది నిన్నే. చెప్పేది నీ గురించే." అని అక్కడినుంచి వెళ్ళిపోయాడు రంగారావు.

• * *

మరుసటిరోజు అద్విక్ తన స్కూల్ చూపించమని అల్లరి చెయ్యడంతో ముగ్గురు బయల్దేరారు. మామూలు బస్తీలో అతి మామూలు స్కూలు. అప్పుడెలా ఉందో ఇప్పుడూ అలానే ఉంది. సిటీలో స్కూల్స్ అన్నీ కార్పొరేట్ అయిపోయ్యాయి. డొనేషన్ పెంచేసి సాఫ్ట్ వేర్ ఆఫీస్ లకి దీటుగా తాయారు చేశారు. కాని తను చదువుకున్న స్కూలు అలాగే ఉండడం ఆశ్చర్యం వేసింది. బిల్డింగ్ అలాగే ఉంది కాని చాల పాతపడిపోయింది. చూస్తే పిల్లలు కూడా బాగా తగ్గినట్టున్నారు.

బయట రోడ్డు మీదే కారు పార్క్ చేసి లోపలి వెళ్ళారు. మానేజ్మెంట్ రూం ఎక్కడుందో సరాసరి అక్కడికే వెళ్ళాడు. ఫ్యూన్ ఉన్నాడు. గుర్తుపట్టడానికి ప్రయత్నించాడు కాని గుర్తురాలేదు. వయసు మాత్రం ఎక్కువే ఉంది అతనికి.

"నేను ఇదే స్కూల్లో చదువుకున్నానండి. పాసయ్యి పదిహేడు పద్దెనిమిది సంవత్సరాలయ్యింది. ఒకసారి చూద్దాం అనిపించి ఒచ్చాను. ప్రిన్సిపాల్ గారు రెడ్డిగారేనా ఇంకా?" సూటిగా పాయింటుకి ఒచ్చేశాడు.

"ఎక్కడ సార్. ఆయన పోయి అయిదేళ్ళయింది."

“అయ్యో.” ఒక్కసారి మనసు కలుక్కుమని అనిపించింది. ప్రిన్సిపాల్ చేతిలో ఎన్ని సార్లో దెబ్బలు తిన్నాడు. ఒక్కసారి కూడా ఆయన మెచ్చుకున్న క్షణాలు లేవు. ఆయన ఒస్తున్నడంటేనే పిల్లలందరికీ హడల్. ముందు కొట్టి తరవాత విషయం అడిగే టైపు. కాని ఎందుకో ఇప్పుడు ఇలా అనిపించింది.

“మరి ఇప్పుడు ఎవరు ప్రిన్సిపాల్?”

“ఆయన కూతురు ప్రజ్ఞా మేడమ్. ఆయన పోయినప్పటినించి మేడమే చూసుకుంటున్నారు. లోపలే ఉన్నారు, వెళ్లి కలవచ్చు” అని పంపించాడు.

ప్రిన్సిపాల్ రూం ముందుకెళ్ళి నిలబడ్డాడు. లోపలి వెళ్ళబుద్ధి కాలేదు.

లక్ష్మిని అద్విక్ ని పిలిచాడు.

“ఇదే రూం ముందు ఎన్ని సార్లు నిలబడ్డానో తెల్సా. క్లాసులు ఎగ్గొట్టి క్రికెట్ ఆడడానికి వెళ్ళేవాళ్ళం. మా టీచర్ కి తెలిసి పనిష్మెంట్ కోసం ఇక్కడే నిలబెట్టేది. మా ప్రిన్సిపాల్ ఒచ్చి వీర కొట్టుడు కొట్టేవారు.” ఇప్పుడు కూడా అక్కడ ఇద్దరు పిల్లలు నిలబడి ఉన్నారు.

“కాని ఇక్కడ వెయిట్ చేసినంత సేపు విచిత్రమైన పోసిషన్ ఉండేది. లోపల భయం. బయటికి అందరం నవ్వేవాళ్ళం.”

ఇప్పుడు లోపలి వెళ్ళి కొత్త ప్రిన్సిపాల్ ని చూడలనిపించలేదు రఘుకి. ప్యూన్ ని పిలిచాడు.

“నాకు మేడం గారిని డిస్టర్బ్ చేయాలని లేదు. ఊరికే స్కూల్ చూస్తాం అంతే. వెళ్లి చెప్పి రా” అని పంపించాడు.

తను ఇద్దరిని తీస్కోని స్కూల్ లోపలి నడిచాడు. చుట్టూ బిల్డింగు మూడు అంతస్థులది. అన్ని క్లాసులు. మధ్యలో గ్రౌండు. ఒక వైపుకి స్టేజ్. అంతా అలాగే ఉంది. కాని సిమెంట్  స్టేజ్ పెచ్చులు ఊడిపోయి ఉంది. గోడలు కూడా పాడయిపోయాయి.

“ఇక్కడే మేము ఆడుకునే వాళ్ళం. పీటీ టైం అప్పుడు ఇక్కడ. లేకపోతే పక్క గల్లీలో ఇంకో గ్రౌండ్ ఉండేది. అక్కడ.” ఉత్సాహంగా చెప్తూ ఉన్నాడు.

“ఏం ఆడేవారు అంతగా.” రఘుని ఎప్పుడూ అంత ఉత్సాహంగా చూడలేదు కాబట్టి ఇంకా కనుక్కోవాలి అనిపించింది లక్ష్మికి.

“ఇంకేంటి..? క్రికెట్. ఇక్కడ రా” అని గ్రౌండ్ లో ఒక చోటికి తీస్కెళ్ళాడు.

“ఇక్కడ చూడు. ఇక్కడే వికెట్లు పెట్టుకునే వాళ్ళం. చూస్తే ఇప్పటికి పిల్లలు ఇక్కడే ఆడుతున్నట్టునారు.” నిన్ననే గ్రౌండ్ కి ఒచ్చినట్టు సరిగ్గా అక్కడికే తీస్కెళ్ళాడు. అక్కడ వికెట్లు పెట్టుకున్నట్టు మూడు గుర్తులు ఉన్నాయి.

“ఆ రోజులే వేరు. చాలా అల్లరి చేసేవాడిని. చెప్పా కదా నీకు ఇంతకుముందే” లక్ష్మిని అడిగాడు.

“చెప్పావనుకో. కాని ఇక్కడికొస్తే ఇంత ఎక్సైట్ అవుతావు అనుకోలేదు. తెలిసుంటే ఇంతకు ముందే తెచ్చేదాన్ని.”

“అలా ఏం లేదు. చిన్నప్పటి జ్ఞాపకాలు కదా. మరీ తీపెక్కువ.”

ఇంకా స్కూలంతా తిప్పాడు. తను చదువుకున్నప్పుడు ఉన్న టీచర్లు ఎవరూ ఇప్పుడు లేరని తెలిసింది. రిటైర్ అవ్వడమో, వేరే స్కూల్ కి వెళ్లడమో చేశారు అని తెలుసుకున్నాడు. ఒక అరగంట స్కూల్లోనే గడిపారు.

కాసేపయ్యాక లక్ష్మి అడిగింది, “ఎంత సేపు నువ్వు అక్కడ క్రికెట్ ఆడింది, ఇక్కడ కప్పు గెలిచింది చెప్తావ్, సరిగ్గా క్లాసుకి వెళ్ళింది లేదా. అక్కడ మామయ్యనేమో ఇంట్లో నీకు మాథెమాటిక్స్ లో బోలెడు మార్కులు ఒచ్చాయని షీల్డులు దాచుకుంటున్నారు.” అని కొంటెగా అడిగింది.

“అదా..” ఒక్క క్షణం ఆగాడు. నవ్వు మెల్లిగా కరిగిపోయింది.

“అది తరవాత. నైంత్ క్లాసు నించి. అప్పట్నించి మన రూటే మారిపోయింది. చదువే చదువు. వేరే లోకం లేకుండా పోయింది.” ఒక పది సెకండ్లలో రఘు మొఖం నించి  ఆనందం ఎగిరిపోయింది.

“నాన్న క్రికెట్ మానేయించారు. మాథెమాటిక్స్ ట్యూషన్ పెట్టించారు. ఇంకా అదే పని.”

“మరీ అంత మార్పా. అంత సడన్ గా ఎలా ఒచ్చింది. బుల్బ్ వెలిగిందా?” కొంచం నవ్విద్దాం అని ప్రయత్నించింది.

నవ్వాడు రఘు. “అలా అని కాదు. నాకే అనిపించింది. మనమా మిడిల్ క్లాస్ మనుషులం. చదువుకోకపోతే ఇక కష్టం. మనం కాని మన ఫ్యామిలీ కాని పైకి రావడం కష్టం.”

“కరెక్టే. కాని ఎయిట్త్ నించి నింత్ వెళ్ళేలోపు ఒక్కసారిగా అలా ఎలా మారిపోయావు?”

“చెప్పేవరకు ఒదిలిపెట్టవన్న మాట. సరే పద వెళ్ళిపోదాం. ఇంకా ఇక్కడ ఉండబుద్ధి కావట్లేదు. దారిలో చెప్తా.”

ముగ్గురు కారెక్కారు.

“ఒకే. చెప్పింక. ఏదో చెప్తా అన్నావ్.” ఉత్సాహంగా అడిగింది లక్ష్మి.

•　　　　　　　　*　　　　　　　　*

పెద్ద స్టోరీ స్క్రీన్ ప్లే ఊహించుకోకు. నాకు క్రికెట్ పిచ్చి కదా. రోజు అదే పని. ఇంట్లో నేమో కంగారపడేవాళ్ళు. నేనేమౌతానో అని. ఒక రోజు మా కాలనీకి, పక్క కాలనీకి మ్యాచ్ జరిగింది. చివరిదాకా నాట్ అవుట్ ఉన్నట్టున్నా నేను. అదే మూడ్ లో హ్యాపీగా ఇంటికొచ్చాను. నాన్న అప్పుడే ఇంటికి ఒచ్చినట్టున్నారు. అలసిపోయి ఉన్నారు. సోఫా మీద కూర్చొని కళ్ళు మూసుకొని ఉన్నారు. నేను ఆకలిగా ఉండి సరాసరి వంటింట్లోకి దూరాను. అమ్మ నా కోసమే ఎదురుచూస్తున్నట్టుంది.

“ఒచ్చావా.. నాన్న నీ గురించే అడుగుతున్నారు. మీ స్కూల్ నించి లెటర్ ఒచ్చింది.” అని చెప్తుంది అమ్మ.

మా మాటలకి లేచినట్టున్నారు నాన్న.

“రఘు.. ఇటు రా.” అని పిలిచారు.

లెటర్ తీసి చూపించారు. హాఫ్ ఇయర్లీ మార్కులు. చటుక్కున నాన్న చేతిలోంచి లాక్కొని చూశాను. తెలుగు 70, హిందీ 65, ఇంగ్లీషు 60 మాథెమాటిక్స్ 32, సైన్సు 55 సోషల్ 65. మ్యాథ్స్ లో ఫెయిల్. నాన్న చిన్నప్పట్నించి మ్యాథ్స్ లో ఛాంపియన్.

నేనేమీ మాట్లాడలేదు. ఒక్క నిమిషం ఆగి నాన్నే అన్నారు.

“ఎగ్జామ్స్ ముందు ఎన్ని సార్లు చెప్పను రా. ఒక దెగ్గర కూర్చొని చదివావా అసలు? నువ్వేం చిన్న పిల్లాడివా? బాధ్యత ఉండాలి కదా. మనమేం డబ్బున్నోళ్ళమా? రేపు నీ బతుకు నువ్వు బతకాలి. అది హ్యాపీగా బతకాలి అంటే ఇప్పుడు చదువుకోవాలి. వేరే దారి లేదు.”

నేనేదో చెప్పబోయాను. నాన్న వినలేదు.

“నిన్ను సంజాయిషీ అడగట్లేదు. ఇలా జరిగితే నీ జీవితం పాడయిపోతది అని చెప్తున్నా. ఆ పైన నీ ఇష్టం. ఒక్కటి గుర్తుంచుకో. నీకు ఇవ్వడానికి నా దెగ్గర ఆస్తులేం లేవు. ఇప్పటికైనా ఆటల మీద శ్రద్ధ తగ్గించి చదువు మీద పెంచుకో.” అని అక్కడినించి వెళ్ళిపోయారు.

నాకు చాలా బాధేసింది. నాన్నెప్పుడూ నన్ను తిట్టలేదు. అప్పుడు కూడా నన్ను తిట్టినట్టు లేదు. కాని బాధపడ్డారు. అమ్మ కూడా అదే చెప్పింది. సరే కొంచం కష్టపడి చదువుదాం ఇక నించి అని అనుకున్నాను.

తరవాత కొన్ని రోజులకి మా గల్లీలో ప్రభాకర్ సార్ దెగ్గర నాకు మ్యాథ్స్ ట్యూషన్ పెట్టించారు. ఆయనా బానే చెప్పేవారు. రోజూ స్కూల్ అయిపోగానే ఇంటికి రావడం, ఇంటికి రాగానే ట్యూషన్ కి వెళ్ళడం. ఇదే సరిపోయింది. నెల దాటింది. క్రికెట్ ఆడలేదు. మనసు ఊరుకోలేదు. నాన్న రోజూ నేనేం చేస్తున్నానో అని కనిపెట్టుకుంటూనే ఉండేవారు.

ఒకరోజు మా స్కూల్ నించి పక్క స్కూల్ కి మ్యాచ్ ఆడుతున్నట్టు తెలిసింది. నన్ను సాయంత్రం గ్రౌండ్ కి రమ్మన్నారు మా టీం వాళ్ళు. ఆ ఒక్కరోజు వెళ్ళి, ఆది సెలెక్ట్ అయితే నెక్స్ట సండే వేరే స్కూల్ వాళ్ళతో ఆడొచ్చు. సరే ఇంటికి వెళ్ళి ఈ ఒక్కరోజు ట్యూషన్ వెళ్ళను అని చెప్దాం అని అనుకున్నాను. నాన్న ఇంట్లో లేరు. ఏదో పని మీద బయటికి వెళ్లారంట. అమ్మ కూడా వెళ్ళడానికి రెడీగా ఉంది. నా కోసమే ఎదురుచూస్తుంది. నేను రాగానే తినడానికి ఉన్నవన్ని డైనింగ్ టేబుల్ మీద పెట్టాను, ట్యూషన్ కి వెళ్ళు అని చెప్పి వెళ్ళిపోయింది. చెప్పే అవకాశం రాలేదు అని కాదు, కాని సరే ఎలాగైనా బయటికి వెళ్తున్నారు కదా ఎందుకు లే అని ఊరుకున్నాను. నేను తినేసి నా ఫేవరెట్ బ్యాట్ తీస్కోని బయలుదేరాను.

నెల రోజుల నించి ఆకలి పైన ఉన్నానేమో ఆరోజు చాలా బాగా ఆడాను. ఫోర్లు సిక్సులు హోరేత్తిపోయినయి. అదే ఊపు మీద ఊపు ఇంటికి ఒచ్చాను. అమ్మావాళ్ళు ఒచ్చేసినట్టున్నారు. ఇల్లంతా సైలెంట్ గా ఉంది. టీవీ చప్పుడు కూడా వినబట్లేదు. ఎందుకైనా మంచిది అని నా బ్యాట్ ని బయట డోర్ పక్కనే పెట్టి లోపలి వెళ్ళాను.

చూసేసరికి షాక్. ప్రభాకర్ సార్ ఉన్నారు. నాన్నతో మాట్లాడుతున్నారు. అప్పుడే వెళ్ళడానికి లేచారు. నన్ను చూసి ఏమీ అనలేదు. ఊరికే నవ్వి వెళ్ళిపోయారు అంతే.

నేను ట్యూషన్ కి రాలేదు అని చెప్పారో లేదో. నేను ఇంట్లో చెప్పాలో చెప్పకూడదో అర్థం కాలేదు. చెప్పినా పెద్దగా ఏమనరు మా ఇంట్లో అని ఒక నమ్మకం. అయినా కొంచం భయం కూడా ఉండింది.

ఆయన వెళ్ళగానే నాన్న అడిగారు.

"నిన్న ఏదో టెస్ట్ పెట్టారంట కదా ప్రభాకర్ సార్."

"అవును నాన్న. ఫస్ట్ 3 చాప్టర్స్"

"మరి ఎన్ని మార్కులు ఒచ్చాయి?"

"అది... తెలీదు. ఇంకా ఇవ్వలేదు."

టేబుల్ మీద ఉన్న పేపర్ తీసి ఇచ్చారు. 20 కి 5 మార్కులు ఒచ్చాయి.

"ట్యూషన్ కి వెళ్ళావా ఇవ్వాళ?"

ప్రభాకర్ సార్ నేను రాలేదు అని చెప్పారో లేదో అర్థం కాలేదు. రిస్క్ ఎందుకు అని

"లేదు నాన్న. మా ఫ్రెండ్ వాళ్ళ నాన్న ఉన్నారు కదా. ఆయన బయాలజీ బాగా చెప్తారు. ఏవో డౌట్స్ ఉంటే మా ఫ్రిండ్స్ అందరినీ ఇవ్వాళ రమ్మన్నారు. అక్కడికే వెళ్ళాను. మ్యాథ్స్ తో పాటు సైన్స్ కూడా ఇంప్రూవ్ చేస్కోవాలి కదా."అన్నాను.

"ఏం చేస్తున్నావు రా. నెలరోజుల నుంచీ ట్యూషన్ కి వెళ్తున్నావ్. మార్కులు మాత్రం పెరగట్లేదు. అసలు శ్రద్ధ పెట్టి చదువుతున్నావారా నువ్వు. ఎంతో కొంత మార్పు ఉంటుంది కదా నువ్వు ట్రై చేస్తే."

"ట్రై చేస్తున్నా నాన్న నేను. ఈసారి చూడండి."

విసుక్కొని వెళ్ళిపోయారు.

ఒక్క క్షణం ఆగి చూసేసరికి. గేటు వేసావా అని నన్ను అడుగుతూ బయటికి వెళ్ళారు. అప్పుడే గుర్తొచ్చింది. బయట నా బ్యాట్ ఉంది. ఆయనే వెనకే పరుగెత్తాను. వెళ్ళి చూసేసరికి బ్యాట్ ఆయన చేతిలో ఉంది. చాలా కోపంగా ఉన్నారు. అంతకుముందు నాన్నని అంత కోపంగా ఎప్పుడు చూడలేదు.

“నీ రూంలో ఉండాల్సిన బ్యాట్ ఇక్కడేం చేస్తుంది?”

నాకేం చెప్పబుద్ధి కాలేదు. ఇంకో అబద్ధం ఆడడానికి ధైర్యం చాలలేదు. అలాగే మౌనంగా నిల్చున్నాను.

“ఎన్ని సార్లు చెప్పినా అర్థం కాదా నీకు. మనమేంటో మన ఫ్యామిలీ ఏంటో, జీవితంలో ఏది ముఖ్యమో తెలుసుకోలేని చిన్న పిల్లోడివి కాదు. నీకోసమే బ్రతుకుతున్నాం రా. మా బాధ అర్థం చేస్కోవా? బర్త్ డే రోజు అడిగావని పొరపాటున కొనిచ్చాను రా ఈ బ్యాట్. ఆ డబ్బులు ఎలా ఒచ్చాయో ఆలోచించావా?” చాలా గట్టిగా అరిచారు.

“మీకు చెప్దాం అనుకున్నా నాన్న. ఇవ్వాళా ఇంపార్టెంట్ గేమ్ ఉండింది. ఇంటర్ స్కూల్ గేమ్ ఉంది. దానికోసం. కాని రేపటినించి వెళ్తా నాన్న ట్యూషన్ కి.” అని బతిమాలడానికి ప్రయత్నించాను.

• * *

ఇంత లోపు ఇల్లు ఒచ్చింది. గేటు తీసి కారు లోపల పార్క్ చేసాడు రఘు.

“సరే చెప్పు. ఏం అన్నారు మామయ్యా? ఆత్రుతగా అడిగింది లక్ష్మి.

“ ఏమంటారు. ఈ మెట్టు ఉంది చూశావా? ఇంటి డోర్ ముందు సరిగ్గా మూడో మెట్టు. ఇంకా గుర్తుంది. దీనికేసి బ్యాట్ ను గట్టిగ కొట్టారు.”

ఇంట్లో వాళ్ళు వింటారేమో అని చాలా మెల్లగా మాట్లాడుతున్నాడు రఘు.

“ముందు రెండు సార్లు కొట్టగానే గట్టిగా శబ్దం ఒచ్చింది. ఇంకా అలాగే కొట్టారు. రెండు ముక్కలైపోయింది.”

రఘు కళ్ళల్లో సన్నటి నీటి పొర.

“అంతే. నాన్నని అలా చూడడం అదే మొదటి సారి. ఇంకొక్కసారి అలా చూడొద్దు అనుకున్నా. ఇప్పటివరకు బ్యాట్ కాని బాల్ కాని ముట్టుకోలేదు.”

రఘుకి దెగ్గరగా ఒచ్చి రఘుని హత్తుకుంది లక్ష్మి.

“సరేలే లోపలి వెళ్దాం పదా.” నిద్రపోతున్న అద్విక్ ని ఎత్తుకొని లోపలి వెళ్లారు ఇద్దరు.

• * *

వెళ్ళేసరికి హాల్ లో కూర్చొని ఉన్నాడు రంగారావు. టివీలో క్రికెట్ మ్యాచ్ చూస్తున్నాడు. లక్ష్మికి గుండెల్లో ఝల్లుమనింది. వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకుంటారో అని. అద్విక్ ని లోపల పడుకోబెట్టడానికి వెళ్ళింది.

రఘు నాన్న పక్కన కూర్చున్నాడు.

“స్కూల్ చూసోచ్చాం నాన్న. మీకెప్పుడు చెప్పలేదు. థాంక్స్ నాన్న. మీరు కాని నా క్రికెట్ మాన్పించక పోతే ఇవ్వాళ అమెరికాలో ఈ స్టేజిలో ఇంత హాయిగా ఉండేవాడిని కాదు.” అని టీవీ ఛానల్ మార్చేశాడు రఘు.

# 3. ఉద్యోగం

ఆదివారం మధ్యాహ్నం. వారం మొత్తంలో ఎక్కువ కస్టమర్లు ఒచ్చేది ఇప్పుడే. సూపర్ మార్కెట్ జనంతో కిటకిటలాడుతోంది. పెద్ద పెద్ద కార్పొరేట్ చైన్లు సూపర్ మార్కెట్లు పెట్టకముందు హైదరాబాద్ లో పెట్టుకున్న షాప్ ఇది. ఉన్న నాలుగు కౌంటర్లు ముందు లైన్లు పెరిగిపోయినయి. పదేండ్ల నించి కృష్ణవేణి ఇక్కడే పని చేస్తుంది. పప్పులు, రవ్వ, పిండి ఇలాంటివన్నీ జల్లెడ పట్టడం, ప్యాకింగ్ చెయ్యడం, తరవాత అవన్నీ సర్దడం, షాపు ఊదవటం, కస్టమర్లకు సహాయం చెయ్యడం. ఇలాంటి పనులన్నీ చేస్తుండాలి.

ఒక రెండు నిమిషాలు ఖాళీ దొరికితే వెళ్ళి ఓనర్ తో మాట్లాడాలి అని ఎదురుచూస్తుంది కృష్ణవేణి. కష్టం మీద రెండు నిముషాలు కల్పించుకొని ఓనర్ రూంలోకి వెళ్ళింది.

"ఏంటి కృష్ణవేణి? అంత మంది కస్టమర్లు అక్కడ ఉంటే ఇటొచ్చావు?" బిల్ల్స్ ముందేసుకున్న ఓనర్ తల పైకి ఎత్తకుండానే అడిగాడు.

"నాకు హాఫ్ డే లీవ్ కావలి సార్." సమయం వృథా చెయ్యకుండా అడిగేసింది కృష్ణవేణి.

ఇప్పుడు తల ఎత్తాడు.

"అదేంటి. ఆదివారం రోజు. ఆరోగ్యం బానే ఉందా?"

"ఉంది సార్. కాని కొంచం పని ఉంది బయట. తప్పలేదు."

"సరే. ఎప్పుడూ అడగవు కదా. ఏదో అవసరం ఉండే ఉంటుంది లే. ఊరికే సరే అన్నాను అని చెప్పకు వేరే స్టాఫ్ కి. మళ్ళా అందరూ ఆదివారం కావాలి అని అడగడం మొదలు పెడతారు."

హమ్మయ్య అనుకుంటూ బయటికి నడిచింది కృష్ణవేణి.

"ఆ పప్పులు స్టాక్ నింపేసి వెళ్ళు. అసలే నిన్న ఒకటో తారీకు." అని ముగించాడు మేనేజర్.

డబల్ ఫాస్ట్ గా పని చెయ్యడం మొదలు పెట్టింది కృష్ణవేణి. తను అంత హుషారుగా ఉండడం గమనించింది చంద్రకళ. ఇద్దరూ గత పది సంవత్సరాల నుంచి అక్కడే కలిసి పని చేస్తున్నారు. కష్టం సుఖం పంచుకోవడం అలవాటు. దాని వల్ల చనువు, సఖ్యత ఏర్పడ్డాయి. ఇద్దరిమధ్యా  రహస్యాలు లేనంతగా.

"ఏంటే కృష్ణా? చాలా హుషారుగా చేస్తున్నావు పని." అడిగింది చంద్రకళ.

"మధ్యాహ్నం నించి ఇంటికి వెళ్ళిపోతా అని చెప్పాను ఓనర్ గారికి. అందుకే."

చంద్రకళ ఇంకో ప్రశ్న అడగముందే ఏం చేయ్యబోతుందో కూడా చెప్పింది.

"మా అబ్బాయి బయటికి వెళ్దాం అని ఖచ్చితంగా ఒచ్చేయమన్నాడే. వారం నించి చెప్తున్నాడు. ఆదివారం రోజే వాడికి కుదురుతుంది." కృష్ణవేణి గొంతులో ఆనందం.

"అంత స్పెషల్ ఏముంది?"

"వాడు ఉద్యోగంలో జాయిన్ అయ్యి నెల అయింది కదా. జీతం ఒచ్చింది."

"అవును కదా. అప్పుడే నెల అయిపోయిందా? జీతం రాగానే అమ్మ కోసమే ఆలోచిస్తున్నాడు. పాపం మంచోడు. ఫ్రెండ్స్ తో వెళ్ళకుండా."

"నేను అన్నా కూడా. ఈసారికి మీ ఫ్రెండ్స్ తో వెళ్ళు నాన్నా అని. అస్సలు వినడే. ఒకటే పట్టు. అది కూడా ఇవ్వాళే వెళ్ళాలట."

"నువ్వు ఇన్నేండ్లు పడ్డ కష్టం చూశాడు కదే వాడు. పొద్దున్నించి రాత్రి దాకా వాడికోసమే తపించావు. ఇప్పుడు నీ వంతు. సుఖపడు."

కృష్ణవేణి కళ్ళల్లో నీళ్ళు. 20 ఏళ్ళ జీవితం గిర్రున కళ్ళముందు తిరిగింది.

• * *

20 ఏళ్ళ క్రితం ఇక్కడికి 5 నిమిషాలు కూడా లేని బస్టాప్ లో సూర్యాపేట నించి ఒక బస్సు ఒచ్చింది. క్రిష్ణవేణికి, భర్త దామోదరం, కొడుకు సాయి, సంచీలో ఇరవయి వేల రూపాయలు, కృష్ణవేణి గుండెల్లో ఎన్నో ఆశలు, అన్నీ ఆ బస్సులోనే హైదరాబాదుకి చేరాయి.

పెళ్ళైన మొదటి అయిదేళ్ళు కృష్ణవేణి కాపురం సూర్యాపేటలోనే జరిగింది. నలుగురు అన్నదమ్ముల ఉమ్మడి కుటుంబంలో చిన్నవాడు దామోదరం. అన్నయ్యలు వ్యవసాయం చేస్తారు. ఇతన్ని కూడా రమ్మంటారు కాని ఒకరోజు వెళ్తే నాలుగు రోజులు వెళ్ళడు. ఊర్లో చిన్న చిన్న అప్పులు, బాధ్యత తెలియకుండా తిరగటం ఇలాంటి అల్లరి చిల్లర పనులు చేస్తూ ఉండేవాడు. పెళ్ళయినా, సాయి పుట్టినా ఏం మారలేదు. తల్లిదండ్రులు ఉన్నంత వరకూ అన్నలు భరించారు. వాళ్ళు పోయ్యాకే భారం అనిపించింది. పైగా అప్పటికే సాయి పుట్టాడు. ఒక కుటుంబాన్ని మనం ఊరికే పోషిస్తున్నాం అని వాళ్ళకి అనిపించసాగింది. ఈ విషయం ముందే పసిగట్టింది కృష్ణవేణి. అయినా ఆమెకి కోపం రాలేదు. వాళ్ళు అనుకునేది నిజమే కదా అని మొగుడికి పని మీద శ్రద్ధ పెట్టమని బ్రతిమాలేది. కాని అతను వినిపించుకునే వాడు కాదు.

ఇంట్లో ఒక రెండు మూడు చిన్న గొడవలు అయ్యేసరికి కట్టు బట్టలతో బయటికి వెళ్ళిపోవాల్సిన స్థితి ఒచ్చింది. ఊళ్ళో పెద్దమనుషులు కలిసి దామోదరం ఆస్థి వదిలేసుకున్నందుకు గాను అన్నయ్యలో యిరవై వేలు ఇప్పించారు. దామోదరం అదే ఉన్న ఊళ్ళోనే ఉందాం అన్నాడు. కాని కృష్ణవేణికే సహించలేదు. తన తల్లిగారిల్లు విజయవాడలో. ఒక తమ్ముడు ఉన్నాడు. పేరు రవి. అక్కంటే అభిమానం. రవి అందరినీ అక్కడికి రమ్మన్నా వెళ్ళలేదు. అక్కడికి  వెళ్తే మళ్ళీ దామోదరం అన్నీ వాళ్ళ పైన వదిలేసి బాధ్యత లేకుండా తిరుగుతాడు అని భయం. హైదరాబాదు వెళ్లి ఎలాగో అలాగ బ్రతుకుదాం అన్నది. మొగుణ్ణి ఒప్పించింది. పొద్దు తిరగకుండా బస్సు ఎక్కారు. సిటీలో దిగేసరికి ఎక్కడ ఉండాలో తెలియదు. ఎవరిని అడగాలో తెలియదు. కాని సిటీ అన్నీ అదే నేర్పుతుంది అనే నమ్మకం.

-       *       *

చంద్రకళ పిలవడంతో ఈ లోకంలోకి ఒచ్చింది. తను కదిపప్పు ప్యాక్ చేసేసింది. ప్యాకెట్ల మీద స్టికర్లు వేసి అంటిస్తుంది.

“ఇంతకి ఎక్కడికి వెళ్తున్నారే మరి?”

“ట్యాంక్ బండ్ పక్కన థియేటర్ ఉందంట కదా,  మంచిది. ఎప్పటినుంచో ఉండే అక్కడికి పోవాలని. మనకి ఎక్కడ కుదురుతుంది. కుదిరినా అక్కడ ఉండే రేట్లు మనం భరించలేం. అప్పుడెప్పుడో నువ్వు కూడా చెప్పావు కదా బాగుంటుంది అని. అక్కడికే తీసుకెళ్తా అన్నాడు సాయి.”

“ఓ  ప్రసాద్. పాతదే కదా. మేము చూసి చాలా ఏండ్లు ఐతుంది. అక్కడ ఖర్చు పెట్టకపోతే సరిపోయే. ఊరికే చూసి రాకపోయిన్రు ఎప్పుడయినా.”

“ఎప్పుడూ కుదరలేదు అంతే.”

“కాని చాల బాగుంటదే. మాల్ అంటారంట. నా కొడుకు చెప్పిండు. ఆ మెట్లు ఉంటాయి చూడు. అవ్వే పైకి కిందికి పోతయి. ఎస్కలేటర్ అంటారంట. అది మొదలు అక్కడే చూశ్న. అక్కడనే ఎక్కినా. మస్తుంటది.”

ఎప్పటినుంచో కడుపులో దాచుకున్న భయం మేలుకున్నట్టు అనిపించింది కృష్ణవేణికి.

“అదంటే నాకు చాలా భయమే. మేము హైదరాబాదుకి ఒచ్చిన కొత్తల్లో మా ఆయన తీసుకెళ్ళారు. కాచిగూడలో మహేశ్వరి థియేటర్ కి. అక్కడ ఉండింది అది. ఇరవయిదు రూపాయల టికెట్టు కొంటేనే ఎక్కనిస్తా అన్నాడు వాడు. ఆయనకీ ఇలాంటివి అంటే సరదా కదా. ఒద్దని చెప్తున్నా కొన్నారు ఆయన. తీరా ఎక్కుదాం అనే సమయానికి నాకు చాల భయం వేసింది. వాళ్ళంతా చమటలు పట్టాయి. చివరికి ఎక్కకుండా మామూలు మెట్ల మీద వెళ్ళా. చాలా తిట్టారు ఆయన దానికి.”

ఈ మాటలు వినగానే చంద్రకళ మొఖంలో  ఒక్కసారిగా నవ్వు మాయమయి కోపం ఒచ్చింది.

“ఉంటాయి అలాంటి సరదాలు ఉంటాయి. ఇంకా చాలా సరదాలు ఉంటాయి. ఈసారి ఎన్ని రోజులయింది. మాట్లాడిండా మల్ల?” అడిగింది చంద్రకళ.

“లేదే. రెండేళ్ళయింది. ఏమో మరి నేను కూడా కనుక్కోడానికి ప్రయత్నించలేదు.”

ఇద్దరి మధ్యా కొంచం నిశ్శబ్దం.

నచ్చలేదు క్రిష్ణవేణికి. అందుకే తనే మాట మార్చింది.

“సరే కాని. ఆ ఎస్కలేటర్ ఏంటో అదంటే నాకు చాలా భయమే. ఇప్పుడు ఎట్లా. ఒద్దన్నా వినదు సాయి. మొండివాడు వాడు.”

“ఏం కాదులేపే. మరీ పల్లెటూరు దాన్లాగా.”

“ఏమో. చీర ఇరుక్కుపోతుదేమో దాంట్లో. లేకపోతే ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పడిపోతే అందరూ చూస్తారు. నాకు భయం బాబు.”

“మరీ చాదస్తం నీది. సరే చాలా సేపయ్యింది. స్టాక్ కూడా బానే నింపాము. ఇంక బయల్దేరు మరి.”

“సరేలే. ఉంటా మరి. ఈ నాలుగు ప్యాకెట్ల మీద ధర రాసెయ్యి.” అని చెప్పి మెల్లగా బయటికి ఒచ్చేసింది.

ఇంటికి వెళ్తున్న కృష్ణవేణిని ఆలోచనలు ముంచెత్తాయి. దామోదరం గుర్తొచ్చాడు. చూసి రెండేళ్ళయింది. కొడుక్కి ఉద్యోగం ఒచ్చిందని అతనికి చెప్పలేదు. చెప్పాలా? ఇంటికెళ్ళి సాయిని అడగాలి. ఇంతకీ దామోదరం ఎలా ఉన్నాడో. ఒక్క క్షణం అతను చేసిన పనులు గుర్తొచ్చాయి.

• * *

కొత్తగా హైదరాబాదులో దిగగానే మలక్ పేటలో ఒక చిన్న ఇల్లు వెతుక్కొని దిగారు. రెండే గదులు. ఊళ్ళో పెద్ద ఇంట్లో ఉన్న వాళ్లకి ఇది ఇబ్బందిగానే అనిపించింది. కాని తప్పదు.

దామోదరానికి సహజంగా కలుపుగోలుతనం ఎక్కువ. తొందరగా స్నేహం చెయ్యడం అలవాటు. చుట్టుపక్కల వాళ్ళతో త్వరగానే సఖ్యత ఏర్పడింది. వారం తిరిగేసరికి కృష్ణవేణి తమ్ముడు రవి ఒచ్చాడు. కొన్ని రోజులు ఇక్కడే ఉండి బావకి ఏదో ఒక వ్యాపారం పెట్టించి వెళ్దామనే. దామోదరం తనంతట తాను ఆ పని చెయ్యడు అతనికి నమ్మకం. రెండు రోజులు అయ్యాయి. రవి చుట్టు పక్కల కనుక్కోవడం మొదలు పెట్టాడు. చిన్న కిరాణా షాపు పెట్టుకుంటే బాగుంటుంది అనిపించింది అతనికి. అదయితే కృష్ణవేణి కూడా కూర్చోవచ్చు. దమోదరాన్ని కూడా కనిపెట్టుకున్నట్టు ఉంటుంది. మరునాడు మెల్లిగా ఇదే మాట కదిలించాడు.

“ఏంటి బావ. ఏమనుకుంటున్నారు మరి? ఏం చేద్దామని.?”

“మీ అక్కనే అడుగు. ఉన్న ఊరు ఒదిలి ఈ సిటీకి తెచ్చింది కదా. నా మాట వినకుండా” నిష్ఠూరంగా మాట్లాడాడు దామోదరం.

“ఇప్పుడు అవన్నీ అనుకొని ఏం లాభం లెండి. ఒచ్చేశారు కదా. ఎదో ఒకటి చేసి బతకాలి కదా. ఇది కొత్త మొదలు అనుకోండి.”

“సరే. అదేదో నువ్వు చెప్పు మరి. ఉపన్యాసం ఇవ్వకుండా.”

“మీకు ఇష్టం లేకుండే నేను ఏమీ చెయ్యమనటం లేదు బావ. కాని చూస్తూ ఉంటే డబ్బు ఇట్టే కరిగిపోతుంది. తరవాత బాధపడాలి.” దామోదరం విషయంలో రవి ఎప్పుడు ఓపికగా ఉంటాడు. తన అక్క మొఖం చూసి.

“ఈ పక్కింట్లో ఒకాయన ఉంటాడు. రామారావు. చాలా మంచివాడు. ఆయన దెగ్గర ఒక స్కీం ఉంది. మనం ఒక యాభై వేలు కట్టాలి. తరవాత ఒక ముగ్గురిని చేర్పించాలి. అంతే నెల నెలా డబ్బు ఒచ్చి పడుతుంది. మనమేం చెయ్యక్షర్లేదు.” కుర్చీలో హాయిగా తల వెనక్కి వాల్చి చెప్పాడు దామోదరం

“అవన్నీ నమ్మకండి బావ. ఏమీ చెయ్యకుండా ఊరికే డబ్బు ఎవరూ ఇవ్వరు. అక్క ఏమంటుంది?”

“మీ అక్కా. ఏమంటది. నేను అన్న డానికి కాదు అంటది.”

కృష్ణవేణి పక్కన్నే మౌనంగా నిలబడి వింటుంది. ఈ మాటకి ఏమీ అనబుద్ధి కాలేదు ఆమెకి.

రవి ఒక్కసారి ఆమెని చూశాడు. చెప్పు అన్నట్లు సైగ చేసింది.

“అలా కాదు బావ. నేను చుట్టుపక్కల కనుక్కున్నాను. కృష్ణవేణితో మాట్లాడాను. ఒక చిన్న కిరాణా కొట్టు పెట్టుకుంటే బాగుంటుంది. ఇంట్లో సరుకులకి కూడా ఇబ్బంది కూడా ఉండదు. హోల్ సేల్ మార్కెట్ కూడా దెగ్గరే. మీరు అక్కడనించి తెచ్చుకోవచ్చు. కృష్ణవేణి కూడా మీకు సాయంగా ఉండొచ్చు.”

దామోదరం ఏమీ మాట్లాడలేదు. ఒక నిట్టూర్పు విడిచి మళ్ళీ రవియే మాట్లాడాడు.

“ఏమంటావు బావా. ఆ పని ఏదో చూడమంటావా నన్ను.”

“మీరు మీరు మాట్లాడుకున్నాక ఇంక నన్ను అడగడం ఎందుకు. సరే కానియ్యండి.” అని అక్కడనించి వెళ్ళిపోయాడు దామోదరం.

“ఈ ఒక్క సహాయం చేసి పెట్టు రా రవి. చచ్చి నీ కడుపున పుడతా.”

"అదేం మాట అక్కా. అసలు నేను మనూరికే రమ్మన్నా కదా. మీరే రానన్నారు. అక్కడయితే మిమ్మల్ని కనిపెట్టుకొని ఉండొచ్చు."

"నిజమే రా. కాని నాకు ఇష్టం లేదు. అప్పుడు నీ మీద పూర్తిగా ఆధారపడిపోతాం. ఆయనకి బాధ్యత రావాలనే కదా నా బాధ."

ఆ రోజునించి రవి అదే పనిలో పడిపోయాడు. ఒక చిన్న చోటు చూసి షాపు పెట్టించాడు. కృష్ణవేణి వాళ్ళ దగ్గర ఉన్న డబ్బు చాలదు కాబట్టి తాను ఒక యిరవై వేలు కలిపాడు. అది అప్పా లేక ఊరికే ఇచ్చావా అని కూడా అడగలేదు దామోదరం.

సరుకులు అన్నీ కొనిచ్చి. ఏవి ఏ ధరకు అమ్మాలో చెప్పి, బావని  షాపు జాగ్రత్తగా చూస్కోమని, కృష్ణవేణిని బావని చూస్కోమని మరీ మరీ చెప్పి బయల్దేరాడు.

రోజు దామోదరంతో పాటు కృష్ణవేణి కూడా షాపుకి వెళ్ళింది. పని నేర్చుకుంది. షాపు కూడా మెల్లి మెల్లిగా పుంజుకుంది. కొంచం కొంచం కూడపెట్టడం కూడా మొదలు పెట్టారు.

సాయిని స్కూల్లో చేర్పించారు.

• * *

నాలుగేళ్ళ తరవాత ఒక రోజు. అదే ఇంట్లో. అదే మనుషులు.

"సాయి ఎక్కడున్నాడక్కా?" అడిగాడు రవి.

"ఇక్కడెందుకు అని ఆడుకొమ్మని బయటికి పంపాను రా." కన్నీళ్లు తుడుచుకుంటూ చెప్పింది కృష్ణవేణి.

"ఇన్ని రోజులనించి నాకు ఎందుకు చెప్పలేదు. కొంచం ముందే చెప్తే బాగుండేది. ఇంత గొడవ అవ్వకుండా చూసుకునేవాడిని."

కృష్ణవేణి ఏడుపు ఎక్కువయింది.

"నిన్ను ఏడిపించడానికి కాదక్కా. నేనొకడిని ఉన్నాను. సహాయం చెయ్యడానికి అని మరిచిపోకు ఎప్పుడైనా. బావేం చేస్తున్నాడు."

"ఇప్పుడే పడుకున్నారు. దెబ్బలు బాగా తగిలాయి రా. వీపు మీద మచ్చలు పడ్డాయి."

"అసలేం జరిగింది. ఎవరు వాళ్ళు? కోర్చోబెట్టి మాట్లాడుకోవాలి గాని ఇదేం పద్ధతి. అడిగేవాళ్ళు లేరనుకున్నారా?"

కాస్త ఊపిరి పీల్చుకొని కృష్ణవేణి చెప్పింది.

"అంతా నా ఖర్మ రా. ఒకాయన మాత్రం బాగా పరిచయం. షాపుకి ఒస్తూ పోతూ ఉండేవాడు. వాళ్ళకి మన దెగ్గర పద్దు కూడా ఉంది. నేనూ రోజు షాపుకి ఒస్తూ పోతూ ఉన్నాను. ఆయన బావగారికి డబ్బు ఎప్పుడు ఇచ్చారో, ఎంత ఇచ్చారో అసలు తెలియనే తెలియదు. మిగితా ముగ్గురు అప్పులాళ్ళు ఉన్నారని కూడా నిన్న వాళ్ళు ఆయన్ని పట్టుకెళ్ళాకే తెలిసింది. నాకు ఏదీ చెప్పరు. గట్టిగా అడిగితే గొడవ. యిలా తీస్కెళ్ళి కొడతారని తెలిస్తే నీకెందుకు చెప్పను రా. నువ్వు కాకుండా మాకు మాత్రం ఎవరున్నారు. ఈ ఊరికి ఒచ్చాక అత్తగారింటితో పూర్తిగా తెగిపోయింది. అటు వైపైనా ఇటు వైపైనా మమ్మల్ని కాస్త కనిపెట్టుకు ఉండేది నువ్వొక్కడివే."

"అది సరేలేవే. కాని బాగా నడుస్తున్న షాపు. అసలు అప్పు ఎందుకు చెయ్యవలసి ఒచ్చింది. అది కూడా అలాంటి మనుషుల దెగ్గర. ఈ మధ్య నడవట్లేదా, లేక ఎమన్నా అవసరం ఉండి చేశారా?"

"అది కూడా ఒక బాధరా. షాపు బాగానే నడిచేది. ఒక రెండు మూడేళ్ళు చేతిలో డబ్బులు ఆడేసరికి ఆయనకి విసుగొచ్చినట్టుంది. నన్ను కూర్చోబెట్టి బయటికి వెళ్ళడం మొదలు పెట్టారు. సామాన్లు అయిపోతే నేను చెప్పేదాన్ని. అవ్వి తేవడానికి కూడా బద్ధకం. ఎంత మంది ఎన్ని సార్లు షాపుకి ఒచ్చి కావాల్సింది లేదని తిరిగ వెళ్ళిపోయారో చెప్పలేను. నాకు గుండెల్లో పిండేసినట్లుండేది అలా జరిగినప్పుడల్లా. చేజేతులా లక్ష్మిని తిప్పి పంపుతున్నట్టు అనిపిస్తుంది."

"మరి ఈ అప్పేంటీ. ఎందుకు చేశారు తెలియదా నీకు?"

తెలియదన్నట్లు తల అడ్డంగా ఊపింది కృష్ణవేణి.

"అదేంటక్కా. ఒక్క ఇంట్లోనే ఉంటున్నారా అసలు మీరు?"

ఈ అలికిడికి దామోదరం లేచినట్టున్నాడు. బయటికి ఒచ్చి రవి పక్కన కూర్చున్నాడు. ఏమీ మాట్లాడలేదు.

"ఇప్పుడు ఆరోగ్యం ఎలా ఉంది బావా." మెల్లగా అడిగాడు రవి.

"నాకేం అయిందయ్యా. బానే ఉన్నాను. సిటీలో ఇవన్నీ మామూలే. మీ అక్కే పెద్ద గొడవ చేసి నిన్ను పిలిపించింది."

"అదేంటి బావా. వాళ్ళెవరో ఇంటి మీదికి ఒచ్చి నిన్ను తీస్కెళ్ళి కొట్టి పంపిస్తే అది భయపడదా?"

" అదే చెప్తున్నా. అంత భయపడాల్సిన పని లేదు. నువ్వు హాయిగా ఊరికి వెళ్ళు."

"మరి వాళ్ళు రేపు మళ్ళీ ఒస్తే? అదంతా ఎందుకు అసలు అప్పెందుకు చేశావు, ఎంత చేశావు, అదంతా ఏం చేశావు?" కుండ బద్దలు కొట్టినట్టు అడిగేశాడు రవి.

" అవసరం ఉంది తీస్కున్ననయ్యా. కుటుంబాన్ని పోషించే బాధ్యత లేదా నాకు. ఇంట్లోకి ఇవన్నీ ఎట్లా తెస్తున్నా అనుకున్నావు. మీ అక్కకి ఖర్చు కాదా, మీ మేనల్లుడికి ఖర్చు కాదా?"

"దానికి షాపు ఉంది కదా బావా. ఇంకా డబ్బు అవసరం అయితే నన్ను అడగాల్సింది. రౌడీల్లాగా ఉన్నట్టున్నారు. వాళ్ళనెందుకు అడగడం?"

"అదెక్కడ నడుస్తుంది. నడిచినా మనింటి ఖర్చులకి అదేం సరిపోతుంది. అయినా అదేదో సరదా కోసం చేసింది కాదు. వేరే వ్యాపారం చేద్దామని తీస్కున్నాను.?"

రవికి కోపం ముంచుకొస్తుంది. కాని మొదటినుంచి అక్క కోసం దామోదరంతో నిగ్రహంగా మాట్లాడడం అలవాటు.

"ఏంటది? ఆ వ్యాపారం?."

"సరే చెప్తే కాని వదిలేట్లు లేరు మీ అక్కా తమ్ముళ్ళు. నేను తీస్కుంది అయిదు రూపాయల వడ్డీకి. కాని ఈ సిటీలో చాలా మంది ఇంకా ఎక్కువ వడ్డీకి తీస్కునే వాళ్ళు ఉన్నారు. వీళ్ళ దెగ్గర తీస్కోని వాళ్ళకి ఇవ్వడమే మనం చేసేది. పని తక్కువ. లాభం ఎక్కువ. సంవత్సరం నుంచీ చేస్తున్నాను. ఈసారే కాస్త ఇబ్బంది ఒచ్చింది."

ఆ మాట వినేసరికి ఇద్దరికీ మతి పోయింది. కృష్ణవేణి నోరు తెరిచింది. ఒక్క మాట తనతో చెప్పుంటే ఇదెంత పిచ్చి పనో భర్తకి చెప్పేదాన్ని కదా అనుకుంది. అందుకే చెప్పలేదు అని ఆమెకి అర్ధం అయ్యింది.

“ఎంత పని చేశావు బావ. ఎవరయినా అలాంటి వ్యాపారం చేస్తారా? పది రూపాయలు వడ్డీకి ఒప్పుకునేవాడు అసలు తిరిగి కడతాడా? కట్టకపోతే మనం అప్పుల్లో మునిగిపోమా?”

“రెండేళ్ళనుంచి చేస్తున్నాను. ఇప్పుడేదో కాస్త ఇబ్బంది అయిందని వ్యాపారమే తప్పంటే ఎలా?”

“సరేమరి రెండేళ్ళనుంచీ చేస్తే ఇప్పుడు అప్పులు ఎందుకు అయ్యాయి. సంపాదించలేదా ఇన్నాళ్ళు?” గొంతు పెంచాడు రవి.

“ఈసారి నేను అప్పు ఇచ్చిన ఇద్దరిలో ఒకడు చచ్చాడు. ఇంకొకడు ఊరు వదిలి పారిపోయాడు.” చావు కబురు చల్లగా చెప్పాడు దామోదరం.

కృష్ణవేణి గట్టిగా ఏడవడం మొదలు పెట్టింది.

“ఇప్పుడేం చేస్తావు మరి?” తను సహాయం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నా. ఊరికే ఒప్పుకోకబుద్ది కాలేదు రవికి.

“చూద్దాం. నా దెగ్గరైతే లేవని చెప్తాను. ఏం చేస్తారు తల తీసి మొలేస్తారా.”

దామోదరం ధైర్యం చూసి రవికి ఆశ్చర్యం వేసింది. ఒక భార్య ఉంది. అయిదేళ్ళ కొడుకు ఉన్నాడు. ఇంత బాధ్యత లేకుండా ఈ మనిషి ఎలా ఉండగలడు. ఉన్నా అతనితో తన అక్క ఎలా కాపురం చేస్తుంది ఇన్నాళ్ళనుంచీ.

అదే కోపంలో లేచాడు.

“సరే మరి మీ వ్యాపారం మీరు చూస్కోండి.” అని లేచి గబగబా బయటికి వెళ్ళాడు.

ఆ వెంటనే కృష్ణవేణి వెళ్ళింది.

“ఒరేయ్ తమ్ముడు. ఇదొక్క సహాయం చేసి పెట్టరా. ఆయన నా మాట వినరు. ఈ గండం మాత్రం గట్టెక్కించు. ఆయన్ని ఎప్పుడు తీస్కెళ్ళి ఏం చేస్తారో అని నేను ఛస్తూ బతుకుతున్నాను.” అని రవి చేతులు పట్టుకుంది. ఆమె కళ్ళల్లోనుంచీ నీళ్ళు ధారగా కారిపోతున్నాయి.

అక్కడే ఉన్న సాయి ఇది చూశాడు. రవి కాని, కృష్ణవేణి కాని అది పట్టించుకునే పరిస్థితిలో లేరు.

“సరే అక్కా. నీ కోసం.” అని మళ్ళీ లోపలి వెళ్ళాడు.

బావ పక్కన కూర్చున్నాడు.

“ఏమవుతే అది అవ్వుద్ది అని నువ్వు ఉన్నంత ధైర్యంగా ఉండగలవు, మేము ఉండలేకపోతున్నాం బావా. చెప్పు. ఇప్పుడు ఈ పీడా పోవాలంటే ఎంత కట్టాలి వాళ్ళకి.” అని అనునయంగా అడిగాడు.

“నిన్ను నేను అడగలేదోయ్ బావ. మీ ఊరు వెళ్ళి హాయిగా నీ పని నువ్వు చేసుకో.” నవ్వుతూ అన్నాడు దామోదరం.

రవి నిట్టూర్చాడు.

“అబ్బే. నువ్వు అడగలేదు బావా. నాకే డబ్బెక్కువయ్యి ఇస్తున్నా. చెప్పు ఎంత కట్టాలి.”

“ఒక రెండు లక్షలు మల్లయ్యకి. లక్షా యాభై గణేష్ కి. ఒక నలభై వేలు సింగ్ కి.” అప్పట్నుంచి చెప్పాలి అనుకుని జ్ఞాపకం పెట్టుకున్నట్టు టకటకా చెప్పేశాడు.

“మరి ఒచ్చేవి ఎన్ని ఉన్నాయి దీంట్లో?”

“అవన్నీ కలుపుకునే చెప్పానోయ్. ఇప్పుడు తగ్గిన డబ్బు ఇది. అప్పు ఇది. ఇది కట్టేస్తే నన్ను ముట్టుకునే ధైర్యం ఎవ్వడికీ లేదు.”

రవి నోరు తెరిచాడు. ఇంట్లో తెలియకుండా ఇంత అప్పు ఎలా చేశాడు. ఒక మాట గట్టిగా అనడానికి కూడా లేదు. బావగారు మరి.

ఒక్కసారి కృష్ణవేణిని చూశాడు. శక్తి కూడగట్టుకున్నాడు. చెప్పబోయేది వాళ్ళకు నచ్చదని తెలుసు.

“చూడక్కా. నీకు నచ్చినా నీకు నచ్చకపోయినా నేను చెప్పేది ఇదే. ఆ డబ్బంతా నేను కడతా. బావ చేతికి ఇవ్వను. ఆ అప్పుల వాళ్ళను పిలిచి నేను స్వయంగా కడతా. ఈ షాపు మూసెయ్యండి. మీ వాలకం చూస్తే అందులో సరుకులు కూడా ఏమీ మిగిల్చినట్టు లేదు. నాతోపాటు మనూరికి వచ్చెయ్యండి. అక్కడ బావకి ఒక ఉద్యోగం చూస్తా. మంచిదే. సాయిని స్కూల్లో చేర్పిస్తా. వాడు జీవితాంతం ఎంత చదువుతానంటే అంతా నేనే చదివిస్తా. ఇదే చెప్తున్నా బావా. ఈ షరతులు అన్నిటికీ ఒప్పుకుంటేనే నేను డబ్బు ఇచ్చేది. నేను స్నానం

చేసి గంటలో బస్సు ఉంది. దానికి వెళ్ళిపోతాను. అంత లోపల మీ నిర్ణయం చెప్పండి." అని లేచి వెళ్తూ పక్కనే ఉన్న సాయి తల నిమురుతూ వెళ్ళిపోయాడు. అతని గొంతులో కోపంకన్నా బాధే ధ్వనించింది కృష్ణవేణికి.

రవి స్నానం చేస్తున్నంత సేపు ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. దామోదరం పేపర్ తీసి చదువుతున్నాడు. కృష్ణవేణి ఏడుస్తూ సాయిని అన్నానికి పిలిచింది.

రవి తయారయ్యి సంచి తీశాడు. కృష్ణవేణి కళ్ళల్లోకి చూస్తే తను కరిగిపోతాడు. అది ఆమెకి మంచిది కాదని అతనికి తెలుసు. అందుకే బావని అడిగాడు.

"నేను వెళ్తున్నా బావా. ఏం నిర్ణయించుకున్నారు మరి ఇద్దరూ?" అక్కని కూడా కలిపినట్టు అడిగాడు.

"అది నిర్ణయించేదేంటి? నాలుగు రూపాయలకోసం ఎవడికిందా ఊడిగం చేసే అవసరం లేదు నాకు. ఇల్లరికం వెళ్ళే అవసరం అంతకంటే లేదు." అన్నాడు.

కృష్ణవేణికి చెప్పకుండానే వెళ్ళిపోయాడు.

నలుగు రోజులు గడిచాయి. కృష్ణవేణి భయం భయంగా ఉంది. ఒక్కసారి రవికి ఫోన్ చేద్దాం అనుకుంది. కాని అలాంటిదేమీ చెయ్యొద్దని దామోదరం చెప్పాడు.

ఇంకో రెండు రోజులు ఆగి ఒకతను ఒచ్చాడు. రవి పంపించాడు అని చెప్పి అణా పైసలతో సహా మొత్తం డబ్బు దామోదరం చేతుల్లో పోసి వెళ్ళిపోయాడు. కృష్ణవేణి ఆనందంగా తన తమ్ముడిని పొగిండింది. తన ఊరికి ఒకసారి వెళ్లి వద్దాం అంది. దామోదరం ఒప్పుకోక ఆగిపోయారు. ఒక సారి ఫోన్ చేసి మాట్లాడమంది. అతను ససేమిరా అన్నాడు.

గత్యంతరం లేక కృష్ణవేణే అతనికి తెలియకుండా తమ్ముడికి ఫోన్ చేసింది. తనని ఊరు వచ్చెయ్యమన్నాడు. ఆమె ఒచ్చేస్తే బావ కూడా కొన్ని రోజులకి ఒస్తాడని అతనికి తెలుసు. కాని అందుకు ఆమె రానన్నది. సాయితో కాసేపు మాట్లాడి పెట్టేశాడు. ఆ తరవాత వాళ్ళ మధ్య అంతకు ముందున్న బంధం కాస్త పలుచబడింది. రాకపోకలు ఆగిపోయాయి. మాటలు కూడా తగ్గాయి. డబ్బు ఇచ్చాడని పొగరు వల్లే రవి మాట్లాడడం మానేసాడని దామోదరం కొందరితో చెప్పాడు.

•　　　　　　*　　　　　　*

మరో అయిదేళ్ళ తరవాత మళ్ళీ అదే ఇల్లు, అవే మనుషులు.

రవి అప్పుడే ఒచ్చాడు. అయిదేళ్ళ తరవాత అదే ఆ ఇంటికి రావటం. అప్పుడు జరిగిన సంఘటనలు, ఆ తరవాత కొన్ని కలిపి రెండు కుటుంబాలకి మాటలు దాదాపు ఆగిపోయాయి. అదే ఇల్లు. కాని ఇప్పుడు చాలా కళ తప్పింది. అయిదేళ్ళ తరవాతే అయినా  కృష్ణవేణిని చూస్తే ఇరవయ్యేళ్ళు అయినట్టుంది. అప్పుడే ముసలితనం ఒచ్చేసిందా అన్నట్టుంది. ఒక్క క్షణం గుండెల్లో కలుక్కుమంది. పైగా రెండు రోజులనుంచీ ఎదుస్తున్నట్టుంది. మొఖం అంతా పీక్కుపోయి, జుట్టు రేగిపోయి ఉంది. తన కళ్ళనుండి నీళ్ళు ఎప్పుడొచ్చాయో కూడా గమనించలేదు రవి. ఒచ్చే ముందు ముభావంగా ఉండి, అవసరమైన పని చూస్కోని వెళ్ళిపోదాం అనుకున్నవాడు అదంతా మరిచిపోయాడు. కృష్ణవేణిని దెగ్గర తీస్కున్నాడు.

“ఏంటక్కా ఇది. ఇలా అయిపోయావేంటి? అసలు ఇదంతా జరుగుతుంటే చెప్పొచ్చు కదా. నేనేం చచ్చాననుకున్నావా? చెప్పు. అసలు ఎమన్నా తిన్నావా మొన్నటినుంచి?”

కృష్ణవేణి ఏం మాట్లాడలేదు.

అటు ఇటు చూశాడు. సాయి టీవీ ముందు కూర్చున్నాడు. రవిని చూసి దెగ్గరికి ఒచ్చాడు.

“సాయి… బాగున్నావా రా?” అని సాయిని దెగ్గరకి తీస్కున్నాడు.

“ఏమైయినా తిన్నావా సాయి.?”

“లేదు మామయ్యా” . చిన్నప్పుడు ఎప్పుడో మామయ్యని చూసిన జ్ఞాపకం ఉంది వాడికి.

“ఇంద. ఈ డబ్బు తీస్కోని ఇడ్లి, దోసె హాయిగా తినిరా. వచ్చేటప్పుడు అమ్మకు కూడా తీస్కోని రా. సరేనా?” అని డబ్బిచ్చి పంపించాడు.

కృష్ణవేణి పక్కన కూర్చున్నాడు. కనకదుర్గ గుడి నుంచి తెచ్చిన ప్రసాదం తీసి బొట్టు పెట్టాడు.

ఎక్కడ మొదలు పెట్టాలో అర్థం కాలేదు. కాని తప్పదు.

“చెప్పక్కా. ఇంత జరుగుతుంటే నాకు చెప్పలేదేందుకు?”

కృష్ణవేణి కళ్ళు తుడుచుకుంది.

"ఏం చెప్పమంటావు రా. అప్పుడు నీ దెగ్గర డబ్బు తీసుకున్నందుకే సగం చచ్చాను. ఇంకోసారి నిన్ను ఇబ్బంది పెట్టాలనుకోలేదు."

"పిచ్చిదానిలా మాట్లాడకు. డబ్బిచ్చాను అని నేను ఎప్పుడయినా అన్నానా? అసలు ఆ మాట ఎత్తానా? రక్త సంబంధం అక్కా. ఇలాంటప్పుడు కూడా ఆదుకోకుంటే ఇంకెందుకు?"

కృష్ణవేణి ఏమీ సమాధానం చెప్పలేదు.

"సరే చెప్పు. బావకి ఏమయింది ఎందుకు ఇలా చేస్తున్నాడు?"

"అంతా నా ఖర్మ రా. ఏదో దుర్ముహూర్తంలో పుట్టుంటాను. లేదా పూర్వ జన్మలో ఏదో పాపం చేసుంటాను."

"చేసింది బావ అయితే నిన్ను నువ్వు ఎందుకు అనుకుంటావు. సరే అసలు ఏమయిందో చెప్పు. ఇప్పుడేం చెయ్యాలో అలోచిద్దాం."

కృష్ణవేణి కొంగుతో కళ్ళు తుడుచుకుంది.

"పోయినసారి నువ్వు డబ్బు పంపినాక కొన్ని రోజులు బాగానే గడిచింది. ఒక సంవత్సరం దాకా. షాపుని కష్టపడి మళ్ళీ కాస్త నిలబెట్టాం. ఆయనకి తెలిసి కొంతా తెలియకుండా కొంతా నీకు ఇవ్వాలని డబ్బు కూడా దాచడం మొదలయ్యింది. ఇప్పటికయినా మా కష్టాలు తీరుతున్నాయని, ఆయన తిన్నగా ఉంటున్నారని సంతోషించాను. కాని లోలోపల గుబులుగా ఉండేది. అలవాటు లేని సుఖం కదా.

కొన్ని రోజులకి నేను  అనుకున్నదే నిజం అయింది. ఆ అప్పులాళ్ళు మళ్ళీ ఒచ్చారు. కనుక్కుంటే తెలిసింది కదా నువ్విచ్చిన డబ్బు మొత్తం ఆయన వాళ్లకి కట్టలేదంట. ఎంతో కొంత కట్టి మిగిలాది మెల్ల మెల్లగా షాపు నిలబడ్డాక కడతాను అని చెప్పారంట. వాళ్ళు కూడా అప్పుడప్పుడు కనుక్కుంటూనే ఉన్నారంట. ఈయనేమో ఇప్పుడిస్తా అప్పుడిస్తా అని బండి లాక్కొచ్చారు.

ఆ గొడవ పెరిగి పెరిగి ఒకరోజు వాళ్ళంతా ఒచ్చి మా దెగ్గర ఉన్నదంతా లాక్కుపొయ్యారు.  దాచుకున్న డబ్బుతో వేసిన చీటీలు, షాపులో సామాన్లు మొత్తం. ఆయనతో ఘర్షణ కూడా పడ్డారు. ఆ మరుసటిరోజు

ఆయన నీకు ఫోన్ చేసి ఇలా జరిగింది అని చెప్పమన్నారు. కాని నేను చెయ్యనివ్వలేదు. దానికే పెద్ద గొడవ పెట్టుకున్నారు. ఇంట్లోంచి బయటికి వెళ్ళిపోయారు. ఓ నెల్లాళ్ళు ఎక్కడికెళ్ళారో తెలియదు.

నేను వాడు ఎట్లా గడిపామో మాకే తెలుసు. ఒక్కదాన్నే రాత్రుళ్ళు ఎడ్చేదాన్ని. ఇంట్లో తిండి గింజలకు కూడా కష్టం అయిపొయింది. ఇక చేసేదేంలేక ఈ పక్కింట్లో ఒకావిడ చెప్తే ఓ సూపర్ మార్కెట్లో పని చెయ్యటానికి కుదురుకున్నాను. పప్పులు అవీ శుభ్రం  చేసి ప్యాక్ చెయ్యాలి.  సాయి చిన్న పిల్లవాడు. స్కూలు నుంచి ఒచ్చి ఒక్కడే ఉంటాడు. అదో బాధ.

నెల్లాళ్ళకు ఆయన ఒకసారి ఫోన్ చేశారు. ఎక్కడున్నారో చెప్పలేదు కాని ఇంటికి రావొచ్చా అప్పులవాళ్ళు ఒస్తున్నారా అని అడిగారు. లేదని చెప్పాను. రెండు మూడు రోజలకు ఒచ్చారు.

ఒచ్చినరోజు నుంచి ఇంట్లో గొడవ. ఆయన ఏ ఉద్యోగం చెయ్యనని, వ్యాపారం చేస్తానని. నీ పేరు తియ్యలేదు కాని నిన్ను నేను అడగాలనే ఆయన అభిప్రాయం. నేనూ మొండిగానే ఉన్నాను. ఇక చేసేదేంలేక ఆయన కూడా మా సూపర్ మార్కెట్ పక్కన ఉన్న మెడికల్ స్టోర్ లో పనికి కుదిరారు.

కొన్ని రోజులు ఉండి, పని నేర్చుకొని, ఎవరితోనైనా పార్టనర్షిప్ లో మనమే ఒక షాపు పెట్టుకుందాం అని నాకు చెప్పారు. నేను అవేవి పట్టించుకోలేదు. ఆయన ఏదో ఒక పని చెయ్యడమే నాకు కావాల్సింది. ఆయన నాకిచ్చే డబ్బుతోనే ఇల్లు నడిపి నేను సంపాదించిన దానితో ఒక చీటీ వేశాను.

ఏదో ఒక దారిన పడ్డాం అనుకునేసరికి మళ్ళీ మొన్నే ఆయన బుర్రలో ఏం పుట్టిందో ఏమో. ఈ పని చేశారు. నా చీటీ డబ్బు కూడా పట్టుకుపోయారు." అని ఆపేసింది కృష్ణవేణి.

రవి మౌనంగా కూర్చుని విన్నాడు. అతని కోపం మాత్రం అతని కళ్ళల్లో కనిపిస్తుంది.

"అసలు ఆ అమ్మాయి ఎవరో నీకు తెలుసా మరి?" కథ ఇంకా పూర్తి అవలేదు కదా అన్నట్టు అడిగాడు రవి.

"ఎవరో ముదరష్టంది. ఆయన తోటే ఆ మెడికల్ షాపులో పని చేస్తుంది."

"వాళ్ళిద్దరి మధ్యా పరిచయం ఉన్నట్టు నీకు తెలియదా?"

"అస్సలు తెలియదు రా. నాకు అనుమానమే రాలేదు. మామూలుగానే షాపుకి వెళ్లి వస్తుండేవారు.అదేం మాయ చేసిందో ఎప్పుడు వల్లో వేసుకుందో. ఇలా నన్ను, వాడిని ఒదిలిపెట్టి వెళ్ళిపోయారు."

"ఇంత జరిగాక ఈ మాట అంటున్నానని ఏమీ అనుకోకక్కా. మన బంగారం మంచిది కానప్పుడు పరాయి వాళ్ళని అనుకొని ఏమీ ప్రయోజనం లేదు. అదెవరో లేచిపోదాం అన్నదే అనుకో, ఈయనకి ఉండొద్దా? ఇప్పుడు సాయి కూడా చిన్నపిల్లవాడేం కాదు. వాడికీ రేపు ఇవన్నీ గుర్తుంటాయి. పెద్దయ్యాక వాడు తండ్రిని గౌరవంగా చూడగలడా?"

కొంచం పచ్చిగా మాట్లాడినందుకు రవికి సిగ్గుగా అనిపించింది.

ఈ ప్రశ్నలకి కృష్ణవేణి దెగ్గర సమాధానం లేకుండా పోయింది. ఏడుపు తప్ప.

"ఇంతకీ వెళ్ళేటప్పుడు ఏం తీస్కెళ్ళాడు?"

"మా చీటీ ఎత్తి మొత్తం డబ్బు తీస్కెళ్ళారు. వాళ్ళ షాపు ఓనర్ దెగ్గర పని ఉందని చెప్పి ఒక ఇరవయి వేలు అప్పు చేశారంట. ఆయనకి కూడా తెలియదు ఇంత జరుగుతుంది ఆయన షాపులోనే అని."

"ఎక్కడికి వెళ్ళారో ఏంటో తెలిసిందా?"

"లేదు. అస్సలు తెలియదు."

"సరే. నేను కనుక్కుంటాను. అసలు ఆ అమ్మాయి ఎవరో ఏంటో కనుక్కుంటే ఎక్కడికి వెళ్ళి ఉంటారో అర్ధం అవుతుంది."

"అదేదో తెలుసుకోరా. చచ్చి నీ కడుపున పుడతాను. నలుగురి మధ్యలో తల ఎత్తుకోలేకున్నాను. అందరూ దీని గురించే అడుగుతున్నారు. మొగుడు ఒదిలేసి వెళ్ళిపోయాడు అంటే ఎంత చులకన."

ఒక వారం రోజులు రవి హైదరాబాదులోనే ఉన్నాడు. ఆ అమ్మాయి వాళ్ళ గురించి వాకబు చెయ్యడం. ఎవరినో కనుక్కోవడం వాళ్ళు ఎక్కడో ఉన్నారని చెబితే అక్కడికి వెళ్ళడం. ఇదే పని. కాని దొరకలేదు.

ఇక తనకి కూడా విసుగు పుట్టింది. విజయవాడలో తన పనులు కూడా ఆగిపోయాయి. కాస్త గాలి మారుతుంది అని చెప్పి క్రిష్ణవేణిని, సాయిని తీస్కొని ఊరు బయలుదేరాడు.

• * *

విజయవాడలో ఒక మూడు నాలుగు నెలలు ఉన్నారు కృష్ణవేణి వాళ్ళు. అక్కడ రవి భార్య, పిల్లలు అందరు బాగానే ఉన్నారు కాని కృష్ణవేణికే ఇబ్బందిగా, అవమానంగా ఉండేది. వాళ్ళ కాపురంలో తను ఒక బరువుగా అనిపించింది.  మళ్ళీ హైదరాబాదు ఒచ్చేసి అదే ఉద్యోగం చేద్దాం అనుకుంది. కాని మొగ తోడు లేకుండా ఒక్కతే ఎలా ఉండడం అనే సందేహం పీడిస్తుంది.

ఒకసారి కొండ మీదికి వెళ్ళి అమ్మవారి దర్శనం చేసుకొని వెళ్ళిపోదాం అని సాయిని తీసుకొని వెళ్ళింది. తన జీవితం, తన కొడుకు జీవితం బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంది.

ఇంటికొచ్చి చూసేసరికి. రవి, దామోదరం ఎదురెదురుగా కూర్చున్నారు. చూడగానే కృష్ణవేణి మనసులో పిడుగు పదినట్టయ్యింది. అతని కళ్ళల్లోకి చూడలేకపోయింది. లోపలికి  వెళ్ళి  తలుపు చాటునుంచి చూసింది.

“ఏం కృష్ణవేణి బాగున్నావా?” దామోదరం పలుకరించాడు.

ఆమెకి ఏమీ మాట్లాడబుద్ధి కాలేదు. అలాగే మౌనంగా ఉండిపోయింది.

అతను ఇంకో అయిదు నిముషాలు రవితో మాట్లాడి వెళ్ళిపోయాడు.

తరవాత రవి కృష్ణవేణి గదిలోకి ఒచ్చాడు.

“బావ మళ్ళీ ఇంటికి ఒస్తాను అంటున్నాడక్కా. నువ్వేమంటావ్?”

“ఆమె ఏమయింది?”

“ఏమో. వాళ్ళిద్దరికి పడట్లేదంట. ఆవిడ వెళ్ళిపోయిందంట. మోసపోయాను, డబ్బంతా తీసుకుంది, అదీ ఇదీ అంటున్నాడు. ఇక ఆమెతో మాత్రం అతనికి సంబంధం ఉండదట. అది మాత్రం చెప్తున్నాడు.”

“ఒక్క మాట నిజం చెప్పు రవి, పొరపాటు చేశాను అనే పశ్చాత్తాపం ఆయనలో ఏమయినా కనపడిందా నీకు?”

ఒక్క సెకను ఆలోచించాడు రవి.

“ప్చ్”

“మరేమంటావ్ అక్కా? ఒక్కటి మాత్రం చెప్తున్నాను విను. నాకు నువ్వు ఎప్పటికి బరువు కాదు. సాయిని కూడా చదివిస్తా. ఆ బాధ్యత నాది. వాడికి ఉద్యోగమో వ్యాపారమో ఏదో ఒక మార్గం చూపిస్తా. ఇక నీ ఇష్టం. బాగా ఆలోచించుకో. తొందరేం లేదు” అని వెళ్ళిపోయాడు.

ఒక రెండు నిమిషాలు ఆగి మళ్ళి ఒచ్చాడు రవి.

“నీకు ఒక మాట చెప్పాలి అక్కా. ఈ విషయం వల్ల నీ నిర్ణయంపై ప్రభావం ఉంటుందేమో అని చెప్తున్నా కాని నువ్వు వెళ్తానంటే నాకు మాత్రం అభ్యంతరం లేదు. బరువూ కాదు.”

“చెప్పరా. నాకోసం ఇంత చేస్తున్నావు. నాతో చెప్పడానికి ఏంటి. ఆయన ఇంకా ఏమయినా అన్నారా?”

“అన్నాడు. ఆవిడ తన జీవితం బావ వల్ల పాడయిపోయింది, ఇక ఎలా బతకాలి అంటుందంట. అందుకోసం అని ఒక యాభయి వేలు అడుగుతుందట. లేకపోతే పోలీస్ కేసు పెడతాను అని బెదిరిస్తుందట”

“అయితే” కృష్ణవేణికి తరవాత ఒచ్చే మాట అర్థం అయింది. ఆయినా ఆపుకోలేక అడిగింది.

“అయితే ఆ డబ్బు నిన్ను ఇవ్వమంటున్నారా?”

“అవును.”

“ఒకవేళ ఇవ్వకపోతే నన్ను తీసుకెళ్ళను అంటున్నారా?”

“ఇంచు మించుగా.”

కాని డబ్బు గురించి ఆలోచించొద్దని, తనకు వెళ్ళాలి అనిపిస్తే వెళ్ళమని చెప్పి వెళ్ళిపోయాడు రవి.

కృష్ణవేణికి చాలా తక్కువగా, హీనంగా అనిపించింది దామోదరం ప్రవర్తన. వెళ్ళకూడదు అనుకుంది. పొద్దున్న లేచి రవికి అదే విషయం చెబుదాం అనుకుంది.

కాని రాత్రి రవి గదిలోంచి అతని భార్య గొంతు వినిపించింది.  ఆ యాభై వేలేవో ఇచ్చేస్తే ఆమె వెళ్ళిపోతుందని. ఎలాగో వాళ్ళకి ఆస్తి పంపకాలు కాలేదు కాబట్టి దీనితో అదీ అయిపోతుందని. కృష్ణవేణి జీవితానికి ఒక మార్గం దొరుకుతుందని అన్నది ఆమె. రవి గొంతు మాత్రం వినపడలేదు.

ఉదయం లేచి తన సామాన్లన్నీ సర్దుకుంది. రవి దెగ్గరికి వెళ్ళింది.

"తమ్ముడూ. నేను వెళ్ళిపోతాను రా. ఆయన మీద నమ్మకంతో కాదు. వెళ్ళాలి కదా తప్పదు. ఈ ఒక్కసారి, చివరిసారిగా ఆ యాభయి వేలు ఇచ్చేయి. నేను సంతకం పెట్టేస్తాను. ఇక నాకు ఆస్తితో సంబంధం లేదు అని. ఏమీ అనుకోకు రా" అని తను చెప్పాలనుకున్నదంతా చెప్పేసింది.

"నీ ఇష్టం అక్కా. కాని ఇప్పుడు సంతకాల గోల ఎందుకు. నేను అడగలేదే."

రవి ఎంత చెప్పినా ఆమె ఒప్పుకోలేదు. సంతకం పెట్టేసింది. సాయిని తీసుకొని బయలు దేరింది. రవి డబ్బులు తీసుకొని ఒక వారంలో ఒస్తాను అని చెప్పాడు. దమోదరానికి ఫోను చేసి వీళ్ళు ఒస్తున్నట్టు చెప్పాడు.

- * *

కృష్ణవేణి ఆలోచనల్లోంచి బయటికి ఒచ్చింది. ఇల్లు చేరింది. సాయి ఇంకా పడుకొని ఉన్నాడు. రాత్రంతా కాల్ సెంటర్ లో పని. నెల రోజులనుంచి ఉదయమే అతని నిద్ర. తన కష్టాల్లో సాయిని సరిగ్గా చదివించలేకపోయింది. గవర్నమెంట్ కాలేజీలో చదివి కూడా ఇంగ్లీషు బాగా మాట్లాడడం వలన అతనికి ఈ ఉద్యోగం ఒచ్చింది.

సాయి హైస్కూలు అయ్యేనాటికి దామోదరం మళ్ళీ ఇంటి నుండి పోట్లాడి వెళ్ళిపోయాడు. కృష్ణవేణి దాచుకున్న డబ్బు ఇవ్వను అనడమే కారణం. ఈసారి కృష్ణవేణి ఎవరికీ చెప్పలేదు.

ఎక్కడున్నాడో ఏం చేస్తున్నాడో సరిగ్గా తెలియదు. అప్పుడప్పుడు తనకు సాయికి ఫోను చేస్తుంటాడు. కాని ఒచ్చి వాళ్లతో ఉంటాను అని అనలేదు. ఆవిడ కూడా అడగలేదు.

ఈ మధ్య ఒక ఆరు నెలలుగా చెయ్యలేదు. సాయికి ఉద్యోగం ఒచ్చింది అని చెబితే మళ్ళీ డబ్బు అడుగుతాడేమో అని భయం.

కొంచెంసేపు ఆగి సాయిని లేపింది.

" కాసేపు పడుకో నాన్నా. ఇవ్వాళ బయటికి ఒద్దులే. తరవాత చూద్దాం. అరగంటలో వంట చేసేస్తా అన్నది."

"ఒద్దమ్మా. నేను చెప్పాను కదా. ఇవ్వాళ వెళ్ళాల్సిందే. నువ్వు త్వరగా రెడీ అవు. అరగంటలో బయలుదేరాలి." అని తొందరపెట్టాడు.

ఆటోలో ప్రసాద్ థియేటర్ చేరారు. మాల్ అంతా చాల అందంగా ఉంది. కాని లోపలికి వెళ్ళగానే కృష్ణవేణికి ముందుగా కనిపించింది ఎస్కలేటర్. గుండె గడగడా కొట్టుకుంది.

"అరేయ్. సాయి. మనం మెట్లమీది నుంచి వెళ్దాం రా. ఇదంటే నాకు చచ్చేంత భయం." అండి సాయి చెయ్యి పట్టుకొని.

"నువ్వు మరీ చేస్తావమ్మా. నేను ఉన్నానుగా. నా చెయ్యి గట్టిగా పట్టుకో. కాని అంతకు ముందు మనం ఒకరిని కలవాలి. ఇటు రా."

"ఎవరిని రా."

"నువ్వు ఏమీ అనను అంటే చెప్తా అమ్మా."

"చెప్పు రా. నువ్వు ఏం చేసినా నేను ఏమీ అనుకోను తెలుసు కదా."

"నాన్నని రామ్మన్నానమ్మా."

కృష్ణవేణికి మతిపోయింది. కొడుకు చేజారిపోతాడేమో అని ఒక్క నిమిషం అనిపించింది.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"తప్పుగా అనుకోకమ్మా. నాకు నాన్న కావాలని ఎప్పుడూ అనిపించలేదు. కాని చిన్నప్పటి నుంచీ నిన్ను చూస్తున్నాను. ఇంత కష్టపడ్డావు. నాన్న ఎప్పుడు ఒచ్చినా నువ్వు కాదనలేదు. ఇప్పుడయినా నిన్ను ఆనందంగా చూసుకోవడం నా బాధ్యత కదా."

ఆమె కళ్ళల్లో నీళ్ళు చూశాడు.

"నేను నాన్నతో మాట్లాడాను అమ్మా. ఆయన నిన్ను డబ్బు అడగరు. ఆయనకీ కావాల్సిన డబ్బు నెలకి నేనే ఇస్తాను అని చెప్పాను. నీతో గొడవ పడరు. నిన్ను ఏమీ అనరు. నువ్వు హాయిగా ఉంటే, మీరు కలిసుంటే నాకదే చాలు."

కృష్ణవేణికి బాధేసింది. కాని తన కొడుకు తన గురించే ఆలోచిస్తున్నాడని, తన సుఖం దమోదరంతో ఉంటేనే అని అనుకుంటున్నాడని అర్ధం అయ్యింది. అది తన తప్పే. జీవితంలో మోసపోయిన ప్రతిసారీ తను దామోదరం చేసిన పని మరిచిపోయి మళ్ళీ  అతను కావాలనే చెప్పింది. బహుశా సాయికి అదే గుర్తు ఉండి ఉంటుంది ఆ వయసు నుంచీ.

ఇంతలో దామోదరం కనిపించాడు. సాయి ఎదురు వెళ్లి అతన్ని తీసుకొచ్చాడు.

ఎవరూ ఏమీ మాట్లాడలేదు. సాయి మాత్రం ఉత్సాహంగా ఉన్నాడు.

కృష్ణవేణి సాయివైపు తిరిగి, " మనం వెళ్ళిపోదాం పద. మనకి ఎవరూ అక్కర్లేదు. మనం కష్టాల్లో ఉన్నప్పుడు పట్టించుకోకుండా సుఖం ఒచ్చినప్పుడు ఒచ్చినవాళ్లు అసలే అక్కర్లేదు." అని సాయి చెయ్యి పట్టుకు లాక్కెళ్ళిపోయింది.

సాయి కూడా మారు మాట్లాడకుండా ఒచ్చేశాడు. ఆ వెంటనే భయం లేకుండా, సాయి చెయ్యి పట్టుకోకుండా ధైర్యంగానే ఎస్కలేటర్ ఎక్కింది, దిగింది.

• * *

తరవాత సాయి దమోదరానికి ఫోను చేసి ఏం ఫరవాలేదని, అమ్మ తో మాట్లాడి మెల్లగా ఇంట్లోకి అతను ఇంట్లోకి రావటానికి ప్రయత్నం చేస్తానని చెప్పడం విన్నది. కాని దాని గురించి సాయితో ఏమీ మాట్లాడలేదు.

• * *

కృష్ణవేణి ఉద్యోగం మానలేదు.